# మన జనప్రగతి

తెలుగు దినపత్రిక

నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

సంపుటి : 6 సంచిక : 140 పేజీలు : 8 వెల : రూ.2/- మంగళవారం 16 జూన్ 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool



## ఇరాన్, అమెరికా మధ్య ఒప్పందం కుదిరింది: ట్రంప్



**హైదరాబాద్, మన జనప్రగతి జూన్ 15:**పశ్చిమాసియాలో గత నాలుగు నెలలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ దేశాలు చారిత్రాత్మక శాంతి ఒప్పందానికి వచ్చాయి. దౌత్యపరమైన చర్చల అనంతరం రెండు దేశాలు తమ శత్రుత్వాన్ని వీడి, లెబనాన్ సహా అన్ని ప్రాంతాలలో సైనిక చర్యలను శాశ్వతంగా నిలిపివేయడానికి అంగీకరించాయని పాకిస్థాన్ మిగతా2లో...

## కేరళలో నిపా వైరస్ కలకలం..

### - అప్రమత్తమైన తమిళనాడు సర్కారు




**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూన్ 15:**పొరుగు రాష్ట్రమైన కేరళలోని కోజికోడ్‌లో నిపా వైరస్ అనుమానిత కేసు నమోదు కావడంతో తమిళనాడు ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ రాష్ట్రంలోకి వ్యాపించకుండా నిరోధించేందుకు కేరళ–తమిళనాడు సరిహద్దుల్లోని నీలగిరి జిల్లా యంత్రాంగం నిఘా మిగతా2లో...

# ఎపిలో పెట్టుబడులు పెట్టండి

- ఏపీకి 1,000 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం
- లాజిస్టిక్స్ పరంగా అనేక అనుకూలతలు
- హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే కనెక్టివిటీ
- ఆక్వాకల్చర్‌లో నంబర్ 1గా ఉన్న ఆంధ్రప్రదేశ్
- ఎపిని సందర్శించండి..పెట్టుబడులు పెట్టండి
- సింగపూర్‌లో ప్రముఖ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు భేటీ



**అమరావతి, మన జనప్రగతి జూన్ 15:** ఏపీకి 1,000 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం ఉందని.. లాజిస్టిక్స్ పరంగా అనేక అనుకూలతలు ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే కనెక్టివిటీ ఉందని సీఎం చెప్పారు. లాజిస్టిక్స్ వ్యయం తగ్గించేందుకు ప్రణాళికతో పనిచేస్తున్నామన్నారు. హార్టికల్చర్‌పై లక్ష కోట్లు ఇన్వెస్ట్ చేయబోతున్నామని.. ఆక్వాకల్చర్‌లో నంబర్ 1గా ఉన్నామని వివరించారు. సింగపూర్ పర్యటనలో భాగంగా వివిధ ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వరుసగా సమావేశాలు నిర్వహించారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం వివరించారు. తొలిరోజు పర్యటనలో భాగంగా వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్ హెడ్ మిగతా2లో...



## హైదరాబాద్ నివాసంలో లోకేశ్ దంపతుల పూజలు

### మహాశివుడికి మహాన్యాసక రుద్రాభిషేకం నిర్వహణ

**హైదరాబాద్, మన జనప్రగతి జూన్ 15:** ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి దంపతులు సోమవారం హైదరాబాద్‌లోని తమ నివాసంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశిష్టమైన సోమవారం సందర్భంగా లోకేశ్ దంపతులు మహాశివుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయురారోగ్యాలు, రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రుత్వికుల వేదమంత్రాల నడుమ లోకేశ్, బ్రాహ్మణి మిగతా2లో...



## ఐదేళ్లలో సాగునీటి రంగాన్ని భ్రష్టు పట్టించిన జగన్

- వైసిపి అలసత్వంతో ప్రాజెక్టులు పూర్తిగా దెబ్బతిన్నాయి
- చంద్రబాబు కృషి వల్లనే సాగునీటి ప్రాజెక్టులకు జలకళ
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**కర్నూలు,మన జనప్రగతి జూన్ 15:** జగన్ హయాంలోని ఐదేళ్లలో ప్రాజెక్టుల పనులను నిర్లక్ష్యంగా వదిలేశారని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. వైసీపీ సర్కార్ అలసత్వంతో నీటి ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని ఆగ్రహించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటికీ రిజర్వాయర్లు, చెరువులు నిండుకుండలా ఉన్నాయంటే చంద్రబాబు వాటర్ మేనేజ్‌మెంట్ వల్లనే సాధ్యమైందని ఉద్ఘాటించారు. సోమవారం కర్నూలు ఎంపీ, జిల్లా కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, నియోజక వర్గాల ఇన్‌చార్జ్‌లు, ఇరిగేషన్ అధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు సమావేశం మిగతా2లో...



## దేశంలోనే అతిపెద్దది మద్యం కుంభకోణం

- ఇందులో 50మందికి పైగా ముద్దాయిలు
- జగన్ ప్రధాన సూత్రధారి అంటూ మంత్రి రవీంద్ర విమర్శలు

**అమరావతి, మన జనప్రగతి జూన్ 15:** ఏపీ లిక్కర్ స్కాం భారతదేశంలోనే అతిపెద్ద కుంభకోణమని ఏపీ ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. ఈ కుంభకోణంలో 50మందికి పైగా ముద్దాయిలు ఉన్నారని తెలిపారు. మద్యం కుంభకోణంలో సూత్రదారులెవ్వరూ తప్పించుకోలేరని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. ఇందులో మిగతా2లో...

## మైనార్టీ సంక్షేమాన్ని విస్మరించిన గొడ్డలి పార్టీ

ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క పని చేయని జగన్

మైనార్టీ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ విమర్శ




## దేశ సమగ్రత, శ్రేయస్సు లక్ష్యంగా జనసేన ఆవిర్భావం

- 12 ఏళ్ల ప్రస్థానంలో అనేక పోరాటాలు..విజయాలు..పరాజయాలు
- ఆచరణాత్మక విధానాలతో పయనం వల్లే పార్టీ నిలబడింది
- 21 ఎమ్మెల్యేలను, 3 ఎంపి స్థానాలను గెల్చుకోగలిగాం
- తెలంగాణ ఏర్పాటునుకాదు.. విభజన తీరునే వ్యతిరేకించాం
- మార్పు కోసం ఎవరైనా ప్రయత్నించ వచ్చు
- అందుకు కాక్రోచ్ జనతా పార్టీయే ఉదాహరణ
- జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం సభలో పవన్ కళ్యాణ్



**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూన్ 15:** జనసేన ప్రారంభించినప్పుడు దేశ సమగ్రత, శ్రేయస్సు తప్ప.. తనకు ఏ ఆలోచనా లేదని ఆ పార్టీ అధ్యక్షుడు, డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. పార్టీ స్థాపించినప్పుడు అధికారం వస్తుందో, రాదో కూడా తెలియదన్నారు. 'జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం' పేరిట దిల్లీలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. పార్టీ స్థాపించి 12 ఏళ్లు పూర్తయిందని, ఈ ప్రయాణంలో చాలా పోరాటాలు చేశామని, పరాజయాలు ఎదుర్కొన్నామని చెప్పారు. మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా 7 ప్రాథమిక సూత్రాలను వదలల్లేదు. నిర్దిష్ట ఆచరణాత్మక విధానంతో 21 ఎమ్మెల్యే స్థానాలు, 3 ఎంపీ స్థానాలను సాధించాం. లక్ష మంది సభ్యత్వంతో ప్రారంభమైన పార్టీకి.. 20 లక్షలకుపైగా సభ్యత్వాలు వచ్చాయి. ఇటీవల కాలంలో అన్ని ప్రాంతాల నుంచి వేల మంది పార్టీలో చేరుతున్నారు. పార్టీ ప్రయోజనాల కంటే.. దేశ సమగ్రతకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం. దేశ స్ఫూర్తిని కాపాడుకోవడం మిగతా2లో...

## పవన్ కళ్యాణ్‌ను ఆడిస్తున్న బిజెపి

- బిజెపి కుట్రలో పావుగా మారిన పవన్
- ఇష్టం వచ్చినట్లు తెలంగాణపై మాట్లాడితే ఊరుకోం
- పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ హెచ్చరిక



**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 15:**పవన్ కళ్యాణ్ పదే పదే తెలంగాణను కించపరిచేలా మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యల వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాజకీయాల్లో విచ్చలవిడిగా మాట్లాడటానికి ఇదేమీ సినిమా కాదని మహేష్ కుమార్ గౌడ్ హితవు పలికారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్రంపై, కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలపై కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కళ్యాణ్ స్వతహాగా మాట్లాడడం లేదన్నారు. కేంద్రంలోని మోడీ, ఇతర బీజేపీ నేతలు కించపరిచేలా స్క్రిప్ట్ ఇస్తే, దాని ప్రకారం పవన్ మాట్లాడుతున్నారు. ఆయన పూర్తిగా బీజేపీ ఆడించే తోలుబొమ్మలా మారిపోయారని దుయ్యబట్టారు. తెలంగాణ ఆవిర్భావాన్ని, రాష్ట్ర విభజనను మిగతా2లో...

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా పంతు | అభివృద్ధి మా లక్ష్యం

16 - 06 - 2026

# ఎపిలో పెట్టుబడులు పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ నంబియార్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. సప్లై చైన్, లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుపై గ్రూప్‌తో చర్చలు జరిపారు. ఆటోమేటెడ్, అత్యాధునిక సాంకేతికతతో కూడిన భారీ సప్లై చైన్ సిటీని ఏపీలో నిర్మించే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ఆహార ఉత్పత్తులకు వాల్యూఎడిషన్ ద్వారా ఎగుమతులకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఏపీలో అపార అవకాశాలు ఉన్నాయని... ప్రొడక్షన్‌లో కూడా పెట్టుబడులు పెట్టవచ్చన్నారు. 'ఏపీని సందర్శించండి...

రాష్ట్రంలో ఉన్న పాలసీలు, అనుకూలతలు చూసి పెట్టుబడులు పెట్టండి' అంటూ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. గూగుల్ క్లౌడ్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఏఐ, డేటా సెంటర్, డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా తీర్చిదిద్దే అంశాలపై ఇరువురి మధ్య చర్చకు వచ్చింది. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో గూగుల్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై గూగుల్ క్లౌడ్ సహకారాన్ని సీఎం కోరారు. రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థను మరింత శక్తిమంతం చేసేందుకు ఆధునిక క్లౌడ్ సాంకేతికతల వినియోగంపై చర్చించారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో యువతకు భారీ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రతిపాదించారు. గూగుల్ క్లౌడ్‌తో కలిసి ఏఐ స్కిల్లింగ్, క్లౌడ్ సర్టిఫికేషన్ కార్యక్రమాలను విస్తరించాలని భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్ర ప్రభుత్వ విజయాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న సంజీవని ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు.

# ఇరాన్, అమెరికా మధ్య ఒప్పందం కుదిరింది: ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ ఆదివారం ప్రకటించారు. ఈ చారిత్రాత్మక ఒప్పందంపై వచ్చే శుక్రవారం (జూన్ 19) స్విట్జర్లాండ్‌లో ఇరు దేశాలు అధికారికంగా సంతకాలు చేయనున్నాయి. పాకిస్థాన్, ఖతార్, సౌదీ అరేబియా, టర్కీ దేశాలు ఈ శాంతి చర్చలలో కీలక మధ్యవర్తులుగా వ్యవహరించాయి.ఈ దౌత్యపరమైన ముందడుగును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతా ద్వారా ధ్రువీకరించారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు!" అని ఆయన పోస్ట్ చేశారు. అంతేకాకుండా, హర్మూజ్ జలసంధిపై ఉన్న అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని తక్షణమే తొలగిస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్.. వాణిజ్య నౌకల రాకపోకలకు జలసంధిని తిరిగి తెరుస్తున్నట్లు స్పష్టం చేశారు. "ప్రపంచ దేశాల నౌకలు.. మీ ఇంజన్లను స్టార్ట్ చేయండి. చమురును ప్రవహించనివ్వండి!" అంటూ ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెం గరీబాబాది కూడా ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ద్వారా ఈ ఒప్పందాన్ని, జూన్ 19 స్విట్జర్లాండ్ షెడ్యూల్‌ను అధికారికంగా ధ్రువీకరించారు.

# ఐదేళ్లలో సాగునీటి రంగాన్ని భ్రష్టు పట్టించిన జగన్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ భేటీలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. మొదటి ఏడాదిలోనే హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి, 248 రోజుల్లో 52 టీఎంసీలు తరలించి, రాయలసీమ జిల్లాల్లో రిజర్వాయర్లు, చెరువులను నింపామని పేర్కొన్నారు. కర్నూలు పశ్చిమ ప్రాంతం సాగు, తాగునీరుపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సూచించారని మంత్రి నిమ్మల తెలిపారు. కీలకమైన గుండ్రేవుల, ఆర్డీఎస్ రైట్ కెనాల్, గాజుల దిన్నె, వేదవతి, గురురాఘవేంద్ర ప్రాజెక్టులు పూర్తి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం నీటి ద్వారా 68 చెరువులు నింపేందుకు ఇప్పటికే రూ.228 కోట్లు ఖర్చు చేసి, 98 శాతం పనులు పూర్తి చేసి 67 చెరువులకు నీరందించామని తెలిపారు. జిల్లాలో 68 ట్యాంకుల పథకంలో భాగమైన జొన్నగిరి ట్యాంకుకు పైప్‌లైన్ నిర్మాణంపై అంచనాలు రూపొందిస్తున్నామని వివరించారు. గాజుల దిన్నె ప్రాజెక్టుకు భూసేకరణ, ద

గేట్ల అమరిక, పెంచిన ఒక టీఎంసీ నీటి నిల్వకు అనుగుణంగా వేగంగా పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. 36 ప్రాధాన్యం గల ప్రాజెక్టుల్లో వేదవతి లిఫ్ట్ స్కీంను 2028 నాటికి పూర్తి చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు. వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం డీపీఆర్, అటవీ, పర్యావరణ అనుమతులు పొందే బాధ్యతను వ్యాప్కోస్ సంస్థకు అప్పగించామని మంత్రి నిమ్మల తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలోని నగరడోన రిజర్వాయర్‌లో ఆగిన పనులను మళ్లీ చేపట్టేలా ప్రణాళికలు రూపొందిస్తు న్నామని వివరించారు. గుండ్రేవుల, ఆర్డీఎస్ ప్రాజెక్టులకు సంబంధించి అంతర్రాష్ట్ర సమస్యలు పరిష్కరించేలా సంప్రదింపులు చేపట్టాలని నిర్ణయించామని అన్నారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టుకు సంబంధించి ప్రత్యేక మరమ్మతుల కోసం ప్రణాళిక రూపొందించి, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు సాగు, తాగు నీరందించేలా చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు.జగన్ హయాంలో గురు రాఘవేంద్ర లిఫ్ట్ స్కీమ్‌లో మోటార్లు దొంగలించినా పట్టించుకోలేదని మంత్రి నిమ్మల ధ్వజమెత్తారు. గోరకల్లు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయాలని నిపుణులు చెప్పినా వినకుండా జగన్ హయాంలో పనులను ప్రీ క్లోజర్ చేసిందని ఆగ్రహించారు. శ్రీశైలం ప్లంజ్ పూల్ మరమ్మతులకు గొడ్డలి పార్టీ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో

రూ.203 కోట్లతో శ్రీశైలం డ్యాం మరమ్మతులు చేపట్టామని ప్రస్తావించారు. గోరకల్లు రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నీటిని నింపడానికి రూ.53 కోట్లతో టెండర్లు పిలిచామని తెలిపారు. ఒక్క సీజన్‌లోనే తుంగభద్ర డ్యాంకు రూ.51 కోట్లు ఖర్చుచేసి, 33 కొత్త గేట్లు అమర్చడం అరుదైన రికార్డు అని వ్యాఖ్యానించారు. ఈనెలాఖరులో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల సీఎంలు తుంగభద్ర డ్యాం గేట్లను ప్రారంభించబోతున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# కేరళలో నిపా వైరస్ కలకలం..

(మొదటి పేజీ తరువాయి)

చర్యలను చేపట్టింది. ఇరు రాష్ట్రాల మధ్య నిరంతరాయంగా జరిగే రాకపోకల దృష్ట్యా ముందు జాగ్రత్తగా సరిహద్దులను అప్రమత్తం చేసినట్లు అధికారులు తెలిపారు. నీలగిరి జిల్లా కలెక్టర్ లక్ష్మి భవ్య తన్నేరు ఆదేశాల మేరకు ఆరోగ్య శాఖ సిబ్బంది రంగంలోకి దిగారు.తాళూర్, నాడుగని, నంబియార్‌కున్ను, సోలాడి, పట్టవాయల్ వంటి కీలక సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక వైద్య బృందాలను మోహరించారు. కేరళ నుంచి వచ్చే ప్రయాణికులు, పర్యాటకులలో నిపా వైరస్ లక్షణాలు ఉన్నాయా.. లేదా..? అని నిశితంగా స్క్రీనింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా వ్యాపార, ఉపాధి నిమిత్తం ప్రతిరోజూ కేరళకు వెళ్లి వచ్చే సరిహద్దు గ్రామాల ప్రజలు, వలస కార్మికులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రైవేట్ ఆస్పత్రులను యంత్రాంగం అప్రమత్తం చేసింది.నిపా వైరస్ లక్షణాలతో కూడిన ఏ ఒక్క అనుమానిత కేసు వచ్చినా వెంటనే ఆరోగ్య శాఖకు సమాచారం అందించాలని వైద్య సంస్థలకు ఆదేశాలు జారీ అయ్యాయి. కేరళ నుంచి వచ్చే వారికి జ్వరం లేదా శ్వాసకోశ సమస్యలు ఉంటే స్వచ్ఛందంగా వైద్య సహాయం తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. తమిళనాడులో ఇప్పటివరకు ఎలాంటి నిపా వైరస్ ముప్పు నిర్ధారణ కాలేదని, ఈ చర్యలన్నీ కేవలం ముందస్తు జాగ్రత్తలు మాత్రమేనని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని ఆమె కోరారు. కేరళలో మారుతున్న పరిస్థితులను తాము నిరంతరం సమీక్షిస్తున్నామని, జిల్లా యంత్రాంగం ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధతతో ఉందని తెలిపారు.

# హైదరాబాద్ నివాసంలో లోకేశ్ దంపతుల పూజలు

(మొదటి పేజీ తరువాయి)

దంపతులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కాంక్షిస్తూ లోకేశ్, బ్రాహ్మణి శివారాధన చేశారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వేదోక్తంగా నిర్వహించారు. శివానుగ్రహం కోసం లోకేశ్ కుటుంబం ప్రత్యేక పూజలు చేశారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర సుభిక్షం కోసం మహాశివుడిని లోకేశ్ దంపతులు ప్రార్థించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం ప్రత్యేక హారతులు, ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహించారు.

# దేశ సమగ్రత, శ్రేయస్సు లక్ష్యంగా జనసేన ఆవిర్భావం

(మొదటి పేజీ తరువాయి)

ఒక రోజుతో అయ్యే పని కాదు. దేశ స్ఫూర్తిని ప్రతితరం ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ఏనాడూ జనసేన అడ్డు చెప్పలేదని పవన్ మరోమారు స్పష్టం చేశారు. 2014లో ఏపీని విభజించిన తీరును చూసి మాత్రమే ఆవేదన వ్యక్తం చేశాం. విభజన విషయంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరు.. అసంతృప్తిని, అశాంతిని సృష్టించింది. అప్పటి నుంచి ఇప్పటికీ వారి ధోరణి మారలేదు. జనసేన సభకు అనుమతివ్వకుండా అడ్డుకోవడమే అందుకు ఉదాహరణ. దిల్లీ మెడలు వంచుతాం.. తడాఖా చూపిస్తామంటూ చాలామంది పెద్దలు మాటలు చెబుతారు. వాస్తవానికి అలాంటి నేతలు దిల్లీకి రాగానే వెనక్కి తగ్గుతారు. చాలాసార్లు మనకు మనం తక్కువగా అంచనా వేసుకుంటాం. ప్రతి వ్యక్తి కూడా సమాజంలో మార్పు తీసుకురావొచ్చు. ఈ మధ్య కాక్రోచ్ పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో చూస్తున్నాం. కాక్రోచ్ పార్టీని చూస్తే.. చలిచీమల పద్యం గుర్తుకొచ్చింది. చలిచీమలు కూడా బలమైన పామును చంపేస్తాయని పవన్ అన్నారు. ఈ సమావేశంలో మొత్తం ఐదు కీలక తీర్మానాలని ఆమోదించారు. పార్టీ సిద్ధాంతాలు, దేశ అభివృద్ధి దృష్టికోణం, ప్రజాస్వామ్య విలువలు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి లక్ష్యాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో 'వికసిత్ భారత్ ఆకాంక్షల నుంచి విజయాల వైపు' అనే తీర్మానాన్ని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రతిపాదించారు. ఈ తీర్మానం ప్రధానంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో గత 12 ఏళ్ల సుపరిపాలనను ప్రశంసిస్తూ, ఈ కాలాన్ని దేశ ప్రజాస్వామ్య వికాసంలో ఒక కీలక అధ్యాయంగా పేర్కొన్నారు. జనసేన పార్టీ 'నేషన్ ఫస్ట్' సిద్ధాంతాన్ని బలంగా విశ్వసిస్తుందని మొదటి తీర్మానంలో స్పష్టం చేశారు. దేశ సమగ్రత, ఐక్యత, జాతీయ దృక్పథం, ప్రతి పౌరునికి సమాన న్యాయం వంటి విలువలపై పార్టీకి అచంచలమైన నిబద్ధత ఉందని పేర్కొన్నారు. కులం, మతం, భాష, ప్రాంతాలకు అతీతంగా భారతదేశ వైవిధ్యంలో ఏకత్వమే దేశ బలమని ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారు. మూడో తీర్మానంగా 'సంక్షోభం నుంచి నమ్మకం వైపు ..ఆంధ్రప్రదేశ్‌లో రెండేళ్ల పునర్నిర్మాణం, సంక్షేమం, అభివృద్ధి' అనే అంశాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్ర అభివృద్ధి, పాలనా సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలపై పార్టీ భవిష్యత్తు దిశను ఈ తీర్మానం వివరించింది. నాలుగో తీర్మానంగా 'జనసేన పుష్కర కాల ప్రస్థానం ? త్యాగం, సేవ, ప్రజల నమ్మకం' అనే అంశాన్ని ఆమోదించారు. సామాజిక మార్పు, నైతిక రాజకీయాలు, సమాన అభివృద్ధి లక్ష్యాలతో ప్రారంభమైన జనసేన పార్టీ 12 ఏళ్ల ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. మొత్తం ఐదు తీర్మానాల ద్వారా జనసేన పార్టీ తన రాజకీయ సిద్ధాంతాలను, అభివృద్ధి దృక్పథాన్ని, దేశ సమైక్యతపై నిబద్ధతను మరింత స్పష్టంగా ప్రకటించినట్లు సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశం పార్టీ భవిష్యత్తు కార్యాచరణకు దిశానిర్దేశర చేస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. జాతీయవాదం, దేశ సమైక్యత, వికసిత్ భారత్ లక్ష్యాలు, ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం, యువత ఆకాంక్షలు వంటి కీలక అంశాలపై విస్తృత చర్చలకు వేదికగా నిలిచింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి వచ్చిన పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి, సుపరిపాలన, జాతీయ భద్రత రంగాల్లో సాధించిన పురోగతిని ప్రస్తావించారు. గత 12 ఏళ్ల పాలన ప్రతి భారతీయుడిలో భరోసా, విశ్వాసాన్ని పెంపొందించిందని అభిప్రాయపడ్డారు. వికసిత్ భారత్-2047 లక్ష్యంతో దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు.

# దేశంలోనే అతిపెద్దది మద్యం కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన దోషి జగన్ అంటూ వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అమరావతి వేదికగా మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. జగన్ నేతృత్వంలో జరిగిన అక్రమాల్లో మరిన్ని అసలు వాస్తవాలు త్వరలోనే బయటకు వస్తాయని చెప్పుకొచ్చారు. ఈడీ కూడా దీనిపై విచారణ చేపట్టడంతో కొత్త పేర్లు కూడా బయటకు వస్తాయని తెలిపారు. అస్తవ్యస్త విధానాలతో ఎక్సైజ్ శాఖను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వ విధానాలతో ప్రజల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు ఎక్సైజ్ ఆదాయం గణనీయంగా పడిపోయిందని మండిపడ్డారు. సొంత బ్రాండ్ల ప్రమోషన్ కోసం నాణ్యమైన బ్రాండ్లను తొక్కేశారని దుయ్యబట్టారు. డిజిటల్ పేమెంట్లు లేకుండా పారదర్శకత దెబ్బతీశారని అయ్యారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నూతన ఎక్సైజ్ పాలసీ ద్వారా వ్యవస్థను సరి చేశామని స్పష్టం చేశారు.మద్యం అక్రమాలపై సిట్ విచారణ పారదర్శకంగా జరుగుతోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తున్న మద్యం పాలసీపై మాజీ మంత్రి జోగిరమేశ్ నేతృత్వంలో వైసీపీ నేతలు చెడ్డపేరు తీసుకురావాలని చూసి అడ్డంగా దొరికిపోయారని ఆగ్రహించారు. 13రకాల పరీక్షల తర్వాతే నాణ్యమైన మద్యాన్ని బయటకు పంపుతూ ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# మైనార్టీ సంక్షేమాన్ని విస్మరించిన గొడ్డలి పార్టీ

**అమరావతి,మన జనప్రగతి జూన్ 15:**గొడ్డలి పార్టీ హయాంలో మైనార్టీ సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల బిడ్డలు డీఎస్సీ ద్వారా టీచర్లుగా ఉద్యోగాలు సాధిస్తే వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు కడుపు మంటగా ఉందన్నారు. కుంభకర్ణుడిలా 9 నెలలు నిద్రపోయి ఇప్పుడు లేచి డీఎస్సీపై వైసీపీ అధినేత విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం రాజధాని అమరావతిలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డీ ఫరూక్ విలేకర్లతో మాట్లాడుతూ.. కడపలో హజ్ భవన్ నిర్మిస్తే దాన్ని పూర్తి చేయకుండా ఐదేళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీల కోసం కూటమి ప్రభుత్వంలో రూ.5 వేల కోట్లు కేటాయించామని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా హజ్ యాత్రికులకు రూ. లక్ష ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం ఇస్తూ మైనార్టీ బిడ్డల చదువుకు తోడ్పడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు వైఎస్ జగన్ కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఒద్యాలలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తలేనని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం కర్నూలుకు త్వరలోనే హైకోర్టు బెంచ్ తీసుకొస్తామన్నారు. గత ప్రభుత్వంలో 85 శాతం హామీలకు వైఎస్ జగన్ ఎగనామం పెట్టారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం 90 శాతం హామీలను అమలు చేసిందన్నారు. ఆస్తుల కోసం తల్లి, చెల్లిని వేధిస్తున్నారంటూ జగన్‌పై నిప్పులు చెరిగారు. త్వరలో తల్లి, చెల్లిని జగన్ చంపేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు.

# పవన్ కళ్యాణ్‌ను ఆడిస్తున్న బిజెపి

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కళ్యాణ్ వ్యతిరేకిస్తూ మాట్లాడటం కొత్తేమీ కాదని, గతంలోనూ మోడీతో సహా బీజేపీ నేతలు ఇదే తరహాలో తెలంగాణను అవమానించారని గుర్తుచేశారు. ఎంతో మంది యువకులు ప్రాణత్యాగం చేస్తే, తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని సాకారం చేశారని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు పవన్ కళ్యాణ్ ఎక్కడున్నారు? ఏ సినిమాలో నటిస్తున్నారు? అని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడమంటే సినిమాల్లో డైలాగులు చెప్పినంత సులువు కాదని.. నెహ్రూ, గాంధీ కుటుంబాల త్యాగాల చరిత్రను పవన్ శ్రద్ధగా చదువుకుంటే మంచిదని హితవు పలికారు. ప్రధాని మోడీ ఇవాళ రాకెట్ల ముందు నిలబడి ఫోటోలు దిగుతున్నారంటే, ఆ అంతరిక్ష రంగానికి పునాది వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుంచుకోవాలన్నారు. పవన్ కళ్యాణ్ చాలా పెద్ద హీరో కావడానికి తెలంగాణ ప్రజలు కూడా కారణమని, ఇక్కడి ప్రేక్షకులు చూడబట్టే ఆయన సినిమాలు ఆడాయనే విషయాన్ని మరువరాదని మహేష్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌కు అక్కడ చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని, వాటిపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉంది. కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదు, ఆ విషయంలో ఆయన చాలా చిన్నవాడు. అధికారం ఉందని తెలంగాణ గురించి ఎలా పడితే అలా మాట్లాడితే చూస్తూ ఊరుకోం' అని హెచ్చరించారు. రెండు రాష్ట్రాలు విడిపోయినా అన్నదమ్ములుగా కలిసి ఉండాలని తాము కోరుకుంటున్నామని, కానీ తెలంగాణలో రాజకీయ లబ్ది కోసం ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదని మహేష్ గౌడ్ అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పాలన సాగుతోందని.. ఏపీ సైతం మన వైపు చూసేలా ఇక్కడ పరిపాలన ఉందన్నారు. అయితే, తెలంగాణను కించపరుస్తూ పవన్ కళ్యాణ్ ఇంతలా మాట్లాడుతున్నా.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. వీరి మౌనం వెనుక బీజేపీ, బీఆర్ఎస్, పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందం స్పష్టంగా అర్థమవుతోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు.

# అమెరికా మిస్సోరిలో కుప్పకూలిన విమానం

## - ప్రమాదంలో 12 మంది దుర్మరణం



**వాషింగ్టన్,మన జనప్రగతి జూన్ 15:** అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రంలో ఓ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న 12 మంది చనిపోయారు. స్కైడైవింగ్ చేసే వారిని తీసుకెళ్తుండగా బట్లర్ మెమోరియల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఈదుర్ఘటన జరిగింది. ప్లేన్ టేకాఫ్ అయిన తర్వాత రన్‌వేకు సుమారు 300 గజాల దూరంలో క్రాష్ అయింది. చనిపోయిన వారిలో 11 మంది స్కైడైవర్లు, ఒక పైలట్ ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# శ్రీశైలంలో కిషన్ రెడ్డి దంపతులు



**శ్రీశైలం,మన జనప్రగతి జూన్ 15:**శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను సోమవారం ఉదయం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ మహాద్వారం వద్ద దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. కిషన్ రెడ్డి దంపతులు శ్రీ స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అర్చకులు వేద ఆశీర్వచనాలు పలుకగా, ఈవో స్వామి వార్ల శేష వస్త్రాలు, ప్రసాదాలను బహూకరించారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యల పరిష్కారం చేయాలి: కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



**కర్నూలు మన జనప్రగతి జూన్ 15:-** ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన కలెక్టర్, ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. పిటిషనర్లకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా ఉండాలని, సమస్య పరిష్కారం సాధ్యం కాని పరిస్థితుల్లో కారణాలను వివరించాలని తెలిపారు.జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని కారుణ్య నియామకాల కేసులను ప్రత్యేక దృష్టితో పరిశీలించి 15 రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన కుటుంబాలకు పారదర్శకంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామసుబ్బయ్య, శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

# రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి

**• సంక్షేమం కార్యక్రమం సందర్శించిన**

**జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు**





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 15:-**
రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ శాఖ, పాఠశాల విద్యా శాఖ, దీపం 2, మెప్మా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, డి ఆర్ డి ఏ, ఆర్ అండ్ బి శాఖ వారు ఏర్పాటు చేసిన గుంతల పూడ్చివేత కార్యక్రమం స్టాళ్లను జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి వర్యులు నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సందర్శించారు.ఆయా శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, గత రెండేళ్లలో సాధించిన ప్రగతి, అమలువుతున్న సంక్షేమ పథకాల వివరాలను కలెక్టర్ మంత్రికి వివరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, గత రెండేళ్లుగా జిల్లాలో అటు అభివృద్ధిని, ఇటు సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకెళు న్నామన్నారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అదే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అభివృధి, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడం జరుగుతోందని, పథకాల గురించి కలెక్టర్ మంత్రికి వివరించారు.


## అధికారం రెండు సంవత్సరాల విజోత్సవం కార్యక్రమం



**దేవనకొండ మన జనప్రగతి జూన్ 15 :-** దేవనకొండకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా 2 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కర్నూల్‌లోని బైరెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఎన్డీఏ విజయోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఇంచార్జ్ రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు , జిల్లా అధ్యక్షురాలు, ఎమ్మెల్యేలు, ఎంపీ, కార్పొరేషన్ చైర్మన్లు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల్లా బొజ్జమ్మ , అలాగే తెలుగుదేశం పార్టీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సేవే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో సాధించిన విజయాలను ఈ సందర్భంగా నాయకులు వివరించారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరింత సమర్థవంతమైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు. గౌరీ చరిత్ర ఎంపీ బస్తిపాటి నాగరాజు. కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బుజ్జమ్మ. వైకుంఠం జ్యోతి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం: కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

**- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 119 ఫిర్యాదులు**




**కర్నూలు మన జనప్రగతి జూన్ 15:-** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. ఆదేశించిన కర్నూల్ కొత్తపేటలో ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 119ఫిర్యాదులు వచ్చాయి.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా, సిఐలు శివశంకర్, మస్తాన్ వలి పాల్గొన్నారు.

# జూన్ 24న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాకు రాక

**జొన్నగిరి జియో మైసూర్ గోల్డ్ మైన్స్ సందర్శన**

**ముఖ్యమంత్రి పర్యటనకు తగిన ఏర్పాట్లు చేయండి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 15:-** జూన్ 24న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాకు రానున్నారని ,పత్తికొండ నియోజకవర్గం జొన్నగిరి లో జియో మైసూర్ గోల్డ్ మైన్స్ కంపెనీని సందర్శించనున్నారని, ఈ పర్యటనకు కావలసిన ఏర్పాట్లు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్లాంట్ పరిశీలన, తదుపరి ప్లాంట్ సమీపంలో బహిరంగసభలో పాల్గొననున్నారని తెలిపారు.. హెలికాప్టర్ ల్యాండ్ అయినప్పటి నుండి పబ్లిక్ మీటింగ్ ముగించుకుని తిరిగి విజయవాడ బయలుదేరేంతవరకు అవసరమైన ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. హెలిపాడ్ , బహిరంగ సభ, బారికేడింగ్, రోడ్ల నిర్మాణం ఏర్పాట్లను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి , పంచాయతీరాజ్ శాఖల అధికారులను కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిరంతర కరెంటు సరఫరా చర్యలు , త్రాగునీరు , టాయిలెట్స్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల ఎస్ ఈ లను ఆదేశించారు. మూడు ప్రదేశాలలో అంబులెన్స్ లతో ఉండాలని , లైవ్ బ్లడ్ డోనర్ , కార్డియో , న్యూరో స్పెషలిస్టులు , ల్యాబ్ టెక్నీషియన్లు కూడా అందుబాటులో ఉండేలాగా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు.పి జి ఆర్ ఎస్ రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని ఎంప్లాయిమెంట్ అధికారిణి ని ఆదేశించారు. జలధార జలహారతి, డిఆర్డిఏ, అగ్రికల్చర్, హార్టికల్చర్ , స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర, ఆర్ అండ్ బి తదితర శాఖలకు సంబంధించి స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ , డిఆర్ఓ వెంకట నారాయణమ్మ , ఆర్ అండ్ బి ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి , జిల్లా పరిషత్ సీఈవో వెంకటరమణారెడ్డి , జి జి హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు , డి ఎం హెచ్ ఓ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ , డాక్టర్ భాస్కర్ , డి సి హెచ్ ఎస్ డాక్టర్ జఫరుల్లా , డ్వామా పిడి నరసింహారెడ్డి డిఇఓ నాగరాజు , ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దీప్తి , ఆర్డీవో పత్తికొండ చిన్న ఓబులేసు,డిటిసి శాంతకుమారి, ఐసిడిఎస్ పిడి విజయ , ఎస్ జి ఎస్ డబ్ల్యూ అధికారి భాస్కర్ నాయుడు , ఏడి హార్టికల్చర్ రాజ కృష్ణ రెడ్డి , ఈడి సోషల్ వెల్ఫేర్ తులసిదేవి, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి , జిల్లా పరిశ్రమల అధికారి అశోక్ కుమార్ , ఏపీఎంఐపి పిడి సుధాకర్ , సి పి ఓ భారతి , దేవాదాయ శాఖ ఏసి సుధాకర్ రెడ్డి , డిడి మైన్స్ నాగిని , ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ , డి పి ఓ భాస్కర్ , ఆర్టీసీ ఆర్ఎం వెంకటేశ్వర్లు, తగ్గితర అధికారులు పాల్గొన్నారు.

# 'సర్' ప్రక్రియలో బీఎల్వోలే కీలకం

**- కర్నూలు నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 15:-** ఓటర్ల ముసాయిదా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ - సర్) ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారుల (బీఎల్వోలు) పాత్ర అత్యంత కీలకమని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. సోమవారం ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రారంభమైన సందర్భంగా 93వ పోలింగ్ బూత్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో జరుగుతున్న ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా పూరిస్తున్నారో స్వయంగా పరిశీలించి, వివరాలు నమోదు చేసే విధానాన్ని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. 2002 ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుని, ప్రస్తుత ఓటరు జాబితాను సరిపోల్చి పారదర్శకమైన ముసాయిదా జాబితా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారు, ద్వంద్వ ఓటు హక్కు కలిగిన వారి పేర్లను తొలగించి, తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.ఎన్యూమరేషన్ ఫారంలో ఆధార్ నంబర్, మొబైల్ నంబర్‌తో పాటు తల్లి, తండ్రి లేదా సమీప బంధువుల ఓటరు గుర్తింపు కార్డు (ఈపికె) నంబర్లను నమోదు చేయాలని సూచించారు. 2002 ఓటరు జాబితాలో మ్యాపింగ్ కాని వారు భారత ఎన్నికల సంఘం సూచించిన 11 ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకదాన్ని తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు.2002 ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో తెలుసుకోవడానికి ఓటర్లు https://voters.eci.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి, "సెర్చ్ యువర్ నేమ్ ఇన్ లాస్ట్ ఎస్ ఐ ఆర్" ఆప్షన్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ, బీఎల్వోలు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# ఉరవకొండ ఎంఈఓ ఈశ్వరప్పపై తీవ్ర అవినీతి ఆరోపణలు

**• వెంటనే సస్పెండ్ చేయాలని**

**ఏఐయఫ్‌డీయస్ డిమాండ్**



**ఉరవకొండ మన జనప్రగతి జూన్ 15:-** ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో చేతులు కలిపి విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న ఉరవకొండ మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్పను వెంటనే విధుల్లోంచి సస్పెండ్ చేయాలని ఏ ఐ డీ యఫ్ యస్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీఎం సిద్దు డిమాండ్ చేశారు. ఉరవకొండ పట్టణంలోని ఓ అగ్ర కుల ప్రైవేట్ పాఠశాల అక్రమాలను ప్రశ్నించిన విద్యార్థి సంఘాల పట్ల ఎంఈఓ ప్రదర్శించిన నిర్లక్ష్య వైఖరి, సదరు పాఠశాల యాజమాన్యంతో నడిపిన ఆర్థిక సంప్రదింపులపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. లంచాల కక్కుర్తి.. 'వాటాల' బేరసారాలు!ఈ సందర్భంగా సీఎం సిద్దు మాట్లాడుతూ, ఉరవకొండలోని పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, విచ్చలవిడిగా పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ విక్రయాలపై ఎంఈఓ ఈశ్వరప్పకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయగా.. ఆయన అత్యంత నిర్లక్ష్యంగా, బాధ్యతారహితంగా సమాధానమిచ్చారన్నారు. ఈరోజు సెలవు.. మీకేమైనా సమస్య ఉంటే అనంతపురంలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి వెళ్ళి చెప్పుకోండి" అంటూ ఎంఈఓ ఫోన్ కట్ చేశారని సిద్దు ఆరోపించారు. అంతేకాకుండా, ఫిర్యాదు అందిన వెంటనే సదరు పాఠశాల యాజమాన్యానికి ఫోన్ చేసి, అక్రమాలను కప్పిపుచ్చడానికి నా వాటా నాకు పంపండి అంటూ నేరుగా లంచం డిమాండ్ చేస్తూ బేరసారాలకు దిగడం ఎంఈఓ అవినీతికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు పాతరపాఠశాలల ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫారాలు విక్రయిస్తే సదరు విద్యాసంస్థలను సీజ్ చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారులు మీడియా సాక్షిగా హెచ్చరించినప్పటికీ, ఉరవకొండ ఎంఈఓ మాత్రం ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారని విద్యార్థి నేతలు మండిపడ్డారు. పాఠశాలలో యథేచ్ఛగా అక్రమ వ్యాపారం సాగుతున్నా ఎంఈఓ కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు అందాయనే సంకేతాలు స్పష్టమవుతున్నాయని ఆరోపించారు. ఈశ్వరప్పకు సదరు పాఠశాల యాజమాన్యంపై ఉన్న 'ప్రత్యేక ప్రేమ' వెనుక ఉన్న ఆర్థిక లావాదేవీలపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**సస్పెండ్ చేయకుంటే ఆమరణ నిరాహార దీక్ష!** ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీకి కొమ్ముకాస్తూ, ప్రభుత్వ జీతాలు తింటూ ప్రైవేట్ యాజమాన్యాలకు తొత్తులుగా మారిన ఎంఈఓ ఈశ్వరప్పపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ఆయన్ను విధులనుంచి తొలగించాలని ఏ ఐ యఫ్ డీ యస్ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో, ఎంఈఓ సస్పెన్షన్ వేటు పడేంత వరకు ఉరవకొండ కేంద్రంగా ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నందు, జిల్లా విద్యార్థి నాయకుడు బ్రహ్మ, సంఘం ముఖ్య నాయకులు మధు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మంత్రి నారాయణ 69వ జన్మదిన వేడుకలు

**నెల్లూరు, మన జనప్రగతి జూన్ 15 :-** రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ 69వ జన్మదిన వేడుకలు నెల్లూరు నగరంలో ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు నగరవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు, అన్నదానాలు చేపట్టి సంబరాలు జరిపారు.చింతారెడ్డిపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి అల్లుడు గంటా రవితేజ, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా టీడీపీ కార్యాలయంలో మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి, రవితేజతో కలిసి 69 కేజీల భారీ కేక్‌ను కట్ చేశారు. మంత్రి చిత్రపటానికి డ్రోన్ ద్వారా పాలాభిషేకం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.నగరంలోని పలు డివిజన్లలో అన్నదానాలు, వైద్య శిబిరాలు, కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ప్రజాసేవకు మంత్రి నారాయణ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తారని, నగర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, మేయర్ సుజాత అశోక్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
16 - 06 - 2026

## విద్యార్థుల భద్రతే ప్రాధాన్యం

### - ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు, స్కూల్ ఆటోలపై పోలీసుల స్పెషల్ డ్రైవ్



**మదనపల్లి మన జనప్రగతి జూన్ 15:-** పాఠశాల విద్యార్థుల భద్రతే లక్ష్యంగా జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు రాయచోటి పట్టణంలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం రాయచోటి ట్రాఫిక్ ఎస్ఐ శ్రీ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో తిరుగుతున్న స్కూల్ ఆటోలపై 'స్పెషల్ డ్రైవ్' నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆటో డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాలకు సంబంధించిన ఫిట్నెస్ ధ్రువీకరణ పత్రాలు, ఇన్సూరెన్స్ వంటి కీలక రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులు డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఆశకు పోయి పరిమితికి మించి విద్యార్థులను ఆటోల్లో ఎక్కించి వారి ప్రాణాలతో చెలగాటమాడొద్దని తీవ్రంగా హెచ్చరించారు. ఆటో నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలతో పాటు భద్రతా ప్రమాణాలను విధిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## మాచుపల్లిలో పేకాట స్థావరంపై పోలీసుల మెరుపుదాడి 8 మంది అరెస్టు

### - రూ2.79 లక్షల నగదు స్వాధీనం



**సిద్ధవటం, మన జనప్రగతి, జూన్ 15: -** సిద్ధవటం పోలీస్ స్టేషన్ పరిధిలోని మాచుపల్లి గ్రామ పరిసర ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు మెరుపుదాడి నిర్వహించి 8 మందిని అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ దాడిలో రూ.2,79,060 నగదు, 52 పేక ముక్కలు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా టాస్క్ ఫోర్స్, ప్రత్యేక పోలీసు బృందాలు సంయుక్తంగా దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పరారీలో ఉన్న అమర్నాథ్ రెడ్డి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలో చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనే లక్ష్యంగా నిరంతరం దాడులు నిర్వహిస్తున్నామని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

## జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం వాయిదా

**కడప టౌన్ మన జనప్రగతి జూన్15:-** ఈ నెల 18 తేదిన జరగ వలసిన జిల్లా ప్రజా పరిషత్, సర్వ సభ్య సమావేశము కొన్ని అనివార్య కారణాల వల్ల అధ్యక్షులు, జిల్లా ప్రజా పరిషత్,ఉమ్మడి వై.యస్.ఆర్. కడప జిల్లా వారు వాయిదా వేయడము జరిగినదని తదుపరి సమావేశపు తేదీ త్వరలో తెలియజేయబడునని జిల్లా పరిషత్ సీఈఓ సి. సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు

## "ప్రపంచ వృద్ధుల దుర్వినియోగ వ్యతిరేక చైతన్య దినోత్సవం" పై చౌడమ్మ ఓల్డేజ్ హోమ్, అవగాహన కార్యక్రమం"



**కడప అర్బన్ మన జనప్రగతి జూన్ 15:-** ప్రపంచ వృద్ధుల దుర్వినియోగ వ్యతిరేక చైతన్య దినోత్సవం సందర్భంగా చౌడమ్మ ఓల్డేజ్ హోమ్, కడపలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి-కం-సీనియర్ సివిల్ జడ్జి శ్రీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ, వృద్ధులపై జరిగే శారీరక, మానసిక, ఆర్థిక మరియు భావోద్వేగ హింసను అరికట్టాల్సిన అవసరాన్ని వివరించారు. తల్లిదండ్రులు మరియు వృద్ధ పౌరుల పోషణ మరియు సంక్షేమ చట్టం-2007 ప్రకారం పిల్లలు తమ తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. వృద్ధులను గౌరవించి, వారికి సురక్షితమైన మరియు ఆప్యాయమైన వాతావరణం కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సిబ్బంది, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ మరియు పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## స్వచ్ఛ తిరుపతిలో భాగస్వాములు అవ్వండి: కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి




**తిరుపతి మన జనప్రగతి జూన్ 15:-** స్వచ్ఛ తిరుపతి లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని కొర్లగుంట, సంజయ్ గాంధీ కాలనీ, వివేకానంద కూడలి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నగరంలో పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని సూచించారు. కాలువల్లో, రోడ్ల పక్కన, కూడళ్ళలో చెత్త, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేయాలని తెలిపారు. నగరంలో స్వచ్ఛ సర్వేక్షన్ బృందం పర్యటిస్తోందని తెలిపారు. అధికారులు, సిబ్బంది ప్రజలతో సమన్వయం చేసుకుని స్వచ్ఛ సర్వేక్షన్ లో తిరుపతిని ఉన్నత స్థానంలో నిలిపేందుకు సహకరించాలని తెలిపారు. ప్రజలందరూ చెత్త ఎక్కడపడితే అక్కడ పడేయకుండా మీ ఇంటి వద్దకు వచ్చే మా సిబ్బందికి ఇచ్చి నగర పరిశుభ్రత కు సహకరించాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డి.ఈ. ప్రసాద్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, పారిశుధ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## అక్రమ సంబంధం కోసం భర్త హత్య.... భార్య సహా ముగ్గురు అరెస్ట్



**జమ్మలమడుగు,మన జనప్రగతి జూన్ 15 :-** జమ్మలమడుగులో గౌస్ పీర్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను హత్య చేయించిందనే ఆరోపణలతో మృతుడి భార్య మాబుచాన్‌తో పాటు షేక్ షబ్బీర్, తలారి బుజ్జి అలియాస్ వెంకటరమణలను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, జూన్ 8న గౌస్ పీర్‌ను మద్యం సేవించేందుకు తీసుకెళ్లిన నిందితులు వేపరాల-జమ్మలమడుగు రోడ్డులోని పెన్నా నది సమీపంలో దాడి చేశారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరిన గౌస్ పీర్ చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందాడు. దర్యాప్తులో మాబుచాన్‌కు షబ్బీర్‌తో అక్రమ సంబంధం ఉన్నట్లు, భర్తను హత్య చేసేందుకు పథకం రచించినట్లు తేలిందని పోలీసులు తెలిపారు. నిందితులు నేరాన్ని అంగీకరించి లొంగిపోగా, వారిని అదుపులోకి తీసుకుని నేరానికి ఉపయోగించిన స్కూటీ, సెల్‌ఫోన్లు, రక్తపు మరకలతో ఉన్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు జమ్మలమడుగు డీఎస్పీ కె. వెంకటేశ్వరరావు తెలిపారు.

## బీఈడీ కళాశాలల తనిఖీల్లో అవినీతి ఆరోపణలు

### - సీబీసీఐడీ విచారణ జరపాలని పీడీఎస్‌యు డిమాండ్




**కడప, మన జనప్రగతి జూన్ 15:-** యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ కళాశాలల తనిఖీల పేరిట భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ పీడీఎస్‌యు ఆధ్వర్యంలో సోమవారం కడపలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న మాట్లాడుతూ, కనీస మౌలిక వసతులు, అధ్యాపకులు, విద్యార్థులు లేని బోగస్ బీఈడీ కళాశాలలకు అనుకూల నివేదికలు ఇస్తూ అడ్మిషన్లకు అనుమతులు కల్పిస్తున్నారని ఆరోపించారు. వైవియు సీడీసీ అధికారి రఘుబాబుపై వస్తున్న అవినీతి ఆరోపణలపై సీబీసీఐడీతో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, వైవియు వైస్ ఛాన్సలర్ వెంటనే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం డీఆర్వో మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు జిల్లా, నగర నాయకులు మనోజ్, మహేశ్, ఉపేంద్ర, ఖాసిం, ఆరిఫ్, దుర్గేష్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థకు 37 వినతులు: కమిషనర్ (ఎఫ్.ఏ.సి)శారదా దేవి



**తిరుపతి మన జనప్రగతి జూన్ 15:-** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 37వినతులు వచ్చాయని కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 23మంది వినతులు సమర్పించగా, 14మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా శివజ్యోతి నగర్ దోభిఘాట్ లో మోటార్, షెడ్ మరమ్మతులు చేయాలని, కైకాల చెరువు, శ్రీపురం కాలనీ కి రోడ్లు, భూగర్భ డ్రైనేజి ఏర్పాటు చేయాలని, రాయల్ నగర్ లో పారిశుధ్య భద్రత చర్యలు చేపట్టాలని, నీటి కనెక్షన్ లేకున్నా పన్ను వస్తోంది పరిష్కరించాలని, తిమ్మినాయుడుపాలెం, బృందావన్ కాలని లో డ్రైనేజీ కనెక్షన్లు ఇప్పించాలని, మ్యాన్ హోల్ తొలగించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు పరిష్కరించాలని, జూపార్కు రోడ్డులో తన షాపు తొలగించారు నాకు గుండె జబ్బు ఉంది ఎక్కడైనా బండి పెట్టుకుని జీవించేందుకు మార్గం చూపాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, అన్నారావు కూడలి, సంజీవయ్య నగర్ వద్ద భూగర్భ డ్రైనేజి మరమ్మతులు చేపట్టాలని, తుడా అపార్ట్మెంట్ నందు కామన్ ఏరియా ఆక్రమించారు పరిష్కరించాలని, అమ్మ ఒడి నగదు జమ కాలేదు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, తదితరులు ఉన్నారు.

## తీవ్ర వైకల్యం కలిగిన దివ్యాంగులకు రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలి



**పటాన్ చెరువు మన జనప్రగతి జూన్ 15:-** ఇస్నాపూర్ మున్సిపాలిటీ -పూర్తిగా మంచానికే పరిమితమైన తీవ్ర వైకల్యం కలిగిన దివ్యాంగులకు నెలకు రూ.15,000 పెన్షన్ మంజూరు చేసి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ దివ్యాంగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో 80 శాతం పైగా వైకల్యం కలిగి పూర్తిగా మంచానికే పరిమితమైన దివ్యాంగులకు మానవతా దృక్పథంతో నెలకు దాదాపు రూ.15,000 పెన్షన్ అందిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, మన రాష్ట్రంలోనూ అదే తరహాలో తీవ్ర వైకల్యం కలిగిన దివ్యాంగులకు ప్రత్యేక పెన్షన్ అమలు చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి దివ్యాంగులు కేవలం 4 నుంచి 5 వేల మంది మాత్రమే ఉంటారని, వీరందరికీ రూ.15,000 చొప్పున పెన్షన్ అందించినా ప్రభుత్వంపై నెలకు సుమారు రూ.7.5 కోట్ల లోపే భారం పడుతుందని వివరించారు. రాష్ట్ర బడ్జెట్‌తో పోల్చితే ఇది చాలా స్వల్పమైన మొత్తం అని పేర్కొన్నారు. పూర్తిగా మంచానికే పరిమితమైన దివ్యాంగులకు నిత్యావసర అవసరాలు, వైద్య ఖర్చులు, సంరక్షణ కోసం కేర్ టేకర్ సేవలు అత్యంత అవసరమని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు సహాయకులు అందుబాటులో ఉన్నప్పుడు, స్వయం సేవ చేసుకోలేని దివ్యాంగులకు ప్రత్యేక సహాయం అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. అలాగే రాష్ట్రంలో మరణించిన వ్యక్తుల పేర్లపై లేదా ఇతర అనర్హుల ఖాతాల్లో ఇంకా పెన్షన్ నిధులు జమ అవుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి అర్హుల జాబితాను పునఃపరిశీలించాలని, అనర్హుల పెన్షన్లను వెంటనే రద్దు చేసి నిజమైన అర్హులైన తీవ్ర వైకల్యం కలిగిన దివ్యాంగులకు పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక విధానాలు రూపొందించి, వైద్య సేవలు, ఉపకరణాలు, సంరక్షణ సదుపాయాలను మరింత విస్తరించాలని ఆయన కోరారు. దివ్యాంగుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, మహేష్ కుమార్, బాపు వెంకన్న, నరేందర్, సత్యనారాయణ రెడ్డి, సాయి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


## ప్రజా ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి: జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్



**కడప,మన జనప్రగతి జూన్ 15:-** ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను అత్యధిక ప్రాధాన్యతతో చట్ట పరిధిలో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. వైఎస్ఆర్ కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 131 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమానికి వచ్చిన వృద్ధులు, దివ్యాంగుల వద్దకే స్వయంగా వెళ్లి ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ, బాధితులకు చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అందిన ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖ ద్వారా పరిష్కారం అయ్యే సమస్యలను ప్రజలు నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్. సుధాకర్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ఉర్దూ మీడియం విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు గుర్తింపు తేవాలి

### - మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 15:-** ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల విద్యార్థులు కష్టపడి చదివి అన్ని తరగతుల్లో ఉత్తీర్ణులై పాఠశాలకు మంచి గుర్తింపు తేవాలని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ మహమ్మద్ షబ్బీర్ అన్నారు. స్థానిక మార్కెట్ లోని ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇటీవల పదవ తరగతిలో ఉత్తీర్ణులై మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ముగ్గురు విద్యార్థులకు తన సొంత డబ్బులతో ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలలో చదివే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు తాను ప్రోత్సహక బహుమతులు అంద చేస్తున్నానని ఆయన తెలిపారు. వచ్చే ఎడాది ఉర్దూ పాఠశాలలో పదోతరగతిలో మంచి మార్కులు సాధించే విద్యార్థులకు సంఖ్యతో సంబంధం లేకుండా ఎంతమంది ఉన్నా అంత మందికి తాను ప్రోత్సహ నగదు బహుమతులను అందజేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా ఉపాధ్యాయుల సలహాలను పాటించి బాగా చదువుకోవాల న్నారు. విద్యార్థులు చెడు అలవాట్లుకు లోను కాకుండా చదువు పట్ల శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులు పట్టుదలతో ఉర్దూ విద్యను చదివి ఇదే పాఠశాలకు ఉపాధ్యాయులుగా రావాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాలలో మరమ్మతులకు గురైన తాగునీటి బోరును మరమ్మతులు చేయించి విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రతి విద్యార్థికి శుద్ధి నీటిని అందించేందుకు ప్రభుత్వం ద్వారా మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయించేలా చూస్తానని ఆయన పేర్కొన్నారు . అనంతరం రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్య పుస్తకాలను ఆయన పదోతరగతి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రసాద్, టిఎన్ఎస్ఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు యాసిన్, రాహుల్, మహబూబ్ షరీఫ్, పాఠశాల కమిటి ఛైర్మన్ షాజీరా, వైస్ ఛైర్మన్ కరీముల్లా, ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
16 - 06 - 2026

## భారీ యువత పాల్గొనడంతో విజయవంతంగా ముగిసిన ఓటర్ మ్యాపింగ్, సర్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం



**కడప టౌన్ మన జనప్రగతి జూన్ 15:–** కడప నగరంలోని రవీంద్ర నగర్‌లోని రాజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగరంలోని వివిధ డివిజన్‌లకు చెందిన యువత పెద్ద సంఖ్యలో హాజరై ఆసక్తిగా శిక్షణ పొందారు.ఈ సందర్భంగా సయ్యద్ గౌస్ పీర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలో ప్రతి అర్హుడైన పౌరుడి పేరు నమోదై ఉండేలా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.సర్ ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించేందుకు, ఓటర్ మ్యాపింగ్ విధానం, ఓటరు జాబితాలో పేర్ల చేర్పు, తొలగింపు, సవరణల ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించామని తెలిపారు.శిక్షణ కార్యక్రమం అనంతరం పాల్గొన్న యువతతో కలిసి రియల్ టైమ్ సర్ మ్యాపింగ్ ప్రక్రియను నిర్వహించడం విశేషం. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ, ప్రత్యక్షంగా ఓటర్ మ్యాపింగ్ నిర్వహించి తమ నైపుణ్యాలను ప్రదర్శించారు.పాల్గొన్న యువత తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, తమ పరిసర ప్రాంత ప్రజలకు కూడా ఓటర్ మ్యాపింగ్ మరియు సర్ ప్రక్రియపై అవగాహన కల్పించి, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సయ్యద్ గౌస్ పీర్ కోరారు.ఈ కార్యక్రమంలో కడప సిటీ వైస్ ప్రెసిడెంట్లు సుధాకర్ సాదిక్, డివిజన్ ఇన్‌చార్జ్‌లు మహబూబ్ భాష, సిద్దిక్, అన్వర్, షేక్ అన్వర్ సర్దార్, ఆరిఫ్, కరీం , సుబ్రహ్మణ్యం, హమీద ఖానం తదితరులు పాల్గొన్నారు.

## స్టాప్ డయేరియా‘ క్యాంపెయిన్ పోస్టర్లను ఆవిష్కరించిన డి ఆర్ ఓ




**కడప అర్బన్ మన జనప్రగతి జూన్ 15:–** జిల్లాలో డయేరియా నివారణ పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య శాఖ వారు రూపొందించిన ‘స్టాప్ డయేరియా క్యాంపెయిన్‘ పోస్టర్లను సోమవారం కలెక్టరేట్ లో పిజిఆర్ఎస్ కార్యక్రమం లో డి ఆర్ ఓ మల్లికార్జునుడు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డి ఆర్ ఓ మల్లికార్జునుడు మాట్లాడుతూ "డయేరియా వల్ల ముఖ్యంగా 5 ఏళ్లలోపు పిల్లలు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. పరిశుభ్రమైన తాగునీరు, చేతులు శుభ్రంగా కడుక్కోవడం,పరిసరాల పరిశుభ్రత,సకాలంలో ఓఆర్ఎస్,జింక్ టాబ్లెట్లు వాడటం ద్వారా డయేరియాను 100% నివారించవచ్చు“ అని తెలిపారు.

## పులివెందులపై ఎందుకు కక్ష?: సీఎం చంద్రబాబును ప్రశ్నించిన తులసి రెడ్డి



**వేంపల్లి మన జనప్రగతి జూన్ 15:–** పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, పులివెందులపై ఎందుకు కక్ష చూపుతున్నారని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించారు.సోమవారం వేంపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల కోసం భూముల సేకరణతో పాటు రూ.412 కోట్ల వ్యయంతో ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల భవనాలు నిర్మించారని తెలిపారు. నేషనల్ మెడికల్ కమిషన్ 2024–25 విద్యా సంవత్సరానికి 50 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం పంపిన నివేదికల ఆధారంగా వాటిని ఉపసంహరించుకున్నట్లు పేర్కొన్నారు.గత రెండేళ్లలో కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయించలేదని, దీంతో 2025–26, 2026–27 విద్యా సంవత్సరాలకు సంబంధించి ఎంబీబీఎస్, పీజీ సీట్లు కోల్పోయినట్లు ఆరోపించారు. ఇప్పటికే ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌తో పాటు పలువురు వైద్య, నర్సింగ్, పారామెడికల్ సిబ్బందిని బదిలీ చేశారని విమర్శించారు.ఇప్పటికైనా ప్రభుత్వం పులివెందుల వైద్య కళాశాలలో మిగిలిన పనులు పూర్తి చేసి, 150 ఎంబీబీఎస్, 24 పీజీ సీట్లతో కళాశాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తులసి రెడ్డి కోరారు.

## ప్రకృతి వ్యవసాయంలో పీఎండీఎస్ విధానానికి ప్రాధాన్యం



**గాలివీడు మన జనప్రగతి జూన్ 15:–** గాలివీడు మండలంలోని అరివీటి వాండ్లపల్లి గ్రామంలో రైతులు శ్రీమతి గీదర రాజేశ్వరి, శ్రీ గీదర ధర్మారెడ్డి ఆధ్వర్యంలో సాగు చేస్తున్న 20 ఎకరాల పీఎండీఎ క్షేత్రాన్ని ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీ బి. వెంకట మోహన్ సందర్శించి పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంలో పీఎండీఎస్ విధానం రైతులకు వాతావరణ అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కల్పించడంతో పాటు తక్కువ పెట్టుబడితో మెరుగైన ఫలితాలను అందిస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.పీఎండీఎస్ విధానంలో ప్రధాన పంటలతో పాటు అలసంద, అనప వంటి సజీవ మల్చింగ్ పంటలను సాగు చేయడం వల్ల నేలలో తేమ నిల్వ ఉండటంతో పాటు భూసార పరిరక్షణ, కలుపు నివారణ మరియు నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే కషాయాలు, ద్రావణాలు, విత్తన శుద్ధి పద్ధతులు, పీఎండీఎస్ కిట్లలోని వివిధ పంట రకాల ప్రాధాన్యతను వివరించారు.పీఎండీఎస్ విధానం ద్వారా వర్షాలు ప్రారంభమైన వెంటనే పంటలు వేగంగా మొలకెత్తి ఎదుగుదల సాధిస్తాయని, రైతులకు విత్తన భద్రత, పశుగ్రాస లభ్యత మరియు పంటల వైవిధ్యం లభిస్తుందని పేర్కొన్నారు. అదనంగా ఆకుకూరలు మరియు ఇతర అనుబంధ పంటల సాగు ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.అనంతరం గరుగుపల్లి ఆర్ఎస్‌కే పరిధిలోని వేరుశనగ నమూనా క్షేత్రాలను పరిశీలించారు. వేరుశనగతో పాటు అలసంద, అనప మరియు ఇతర అనుబంధ పంటలను సాగు చేయడం ద్వారా భూసార పరిరక్షణ, పశుగ్రాస లభ్యత, విత్తన స్వావలంబనతో పాటు రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని వివరించారు. బహుళ పంటల సాగు రైతులకు ఆర్థిక భద్రతను కల్పించడంతో పాటు ప్రకృతి వ్యవసాయ లక్ష్యాల సాధనకు దోహదపడుతుందని పేర్కొన్నారు.ప్రకృతి వ్యవసాయ ఆధారిత పీఎండీఎస్ నమూనాలను రైతులు విస్తృతంగా అవలంబించి, సుస్థిర వ్యవసాయం వైపు అడుగులు వేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి. వెంకట మోహన్ సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించండి: జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీమీనా



**కడప మన జనప్రగతి జూన్ 15 :–** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అర్జీదారులు సంతృప్తి చెందేలా. అర్జీల పట్ల బాధ్యతాయుతంగా స్పందించాలని, త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీమీనా అన్ని శాఖల అధికారులను ఆదేశించారు సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీమీనా తోపాటు సబ్ కలెక్టర్ భావన హాజరై ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోందన్నారు. ఈవేదిక ద్వారా అంతే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని, అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలన్నారు. పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలని, జిల్లా అధికారులకు అందిన అర్జీలను పరిష్కరించేందుకు సమయం కేటాయించి సమీక్ష చేయాలన్నారు. ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలోనే ప్రజల సమస్యలను స్థానికంగానే గుర్తించి మండల స్థాయిలోనే పరిష్కరించేలా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ క్లినిక్ ల ద్వారా భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అలాగే అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, డిప్యూటీ కలెక్టర్ శివరామిరెడ్డి, రంగస్వామి, ఎస్ఎస్ఏ ఏపిసి అనురాధ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈవో సావిత్రమ్మను సస్పెండ్ చేయాలని డీవైఎఫ్ఐ డిమాండ్




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 15:–** ప్రొద్దుటూరు పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మేరీ కుమార్, కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రొద్దుటూరు ఎంఈవో శోభారాణికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టణంలోని అనేక ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నాయని ఆరోపించారు. పుస్తకాలపై ముద్రించిన ధరకు భిన్నంగా తల్లిదండ్రులకు బిల్లులు జారీ చేసి అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారని తెలిపారు.అదేవిధంగా నర్సరీ స్థాయి నుంచే వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, పాఠశాలల నోటీసు బోర్డులపై ఫీజుల వివరాలు, ఉపాధ్యాయుల విద్యార్హతలు ప్రదర్శించడం లేదని పేర్కొన్నారు. ఈ అంశాలపై ఎంఈవో సావిత్రమ్మకు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదని, ప్రైవేటు విద్యాసంస్థలకు ఆమె వత్తాసు పలుకుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, అలాగే ఎంఈవో సావిత్రమ్మపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## పకృతి వ్యవసాయ ఉత్పత్తులకు భలే గిరాకి.



**రామాపురం మన జనప్రగతి జూన్ 15 :–** ప్రకృతి వ్యవ సాయ పద్ధతుల్లో పండించిన కూరగాయలు పంటలు ఎంతో ఆరోగ్యంగానూ శ్రేయస్కరంగాను ఉంటాయని పకృతి వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు సోమవారం మండల కేంద్రమైన రామాపురంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన కూరగాయలను పంటలను ప్రజలకు విక్రయించారు వివిధ రకాల కూరగాయాలను పెద్ద సంఖ్యలో ప్రజలు కొనుగోలు చేశారు ఈ సందర్భంగా ఆకృతి వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు రసాయనిక మందులు వాడకుండా పకృతి వ్యవసాయ జీవామృత పద్ధతిలో పంటలను పండించడం వల్ల ఎలాంటి అనారోగ్యాలకు గురికాకుండా ఉండవచ్చునని అలాగే ఆరోగ్యకరంగా ఉంటుందని వారు తెలిపారు పకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలకు ఎక్కువ గిరాకీ ఉందని ఇందులో భాగంగా ప్రతి సోమవారం మండల కేంద్రమైన రామాపురంలో విక్రయాలు జరుగుతాయని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు ఈ కార్యక్రమంలో పకృతి వ్యవసాయంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత సూరం శ్రీదేవి మధుకర్ సూరం వెంకటరామిరెడ్డి కిరణ్ కుమార్ మరి కొంతమంది ప్రకృతి వ్యవసాయానికి చెందిన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 16 ఆధార్ స్పెషల్ క్యాంపులు

### - మున్సిపల్ కమిషనర్ సి. ముని కుమార్




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 15:–**భారతదేశంలో ఆధార్ కార్డ్ ఒక విశిష్ట గుర్తింపు కార్డుగా ఉందని దీని ద్వారా ప్రజలు అనేక రకాల ప్రభుత్వ పథకాలు పొందుతున్నారని పులివెందుల పురపాలక సంఘ కమిషనర్ ఒక తెలిపారు.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఆధార్ కార్డులలో చాలా వరకు బయోమెట్రిక్ అప్‌డేషన్ మరియు డాక్యుమెంట్స్ అప్‌డేషన్ పెండింగ్ ఉన్నాయని కమిషనర్ పేర్కొన్నారు.ప్రభుత్వం వారి ఉత్తర్వుల ప్రకారం పులివెందుల పురపాలక సంఘ పరిధిలోని నిర్దేశించిన విద్యాసంస్థల్లో ఆధార్ స్పెషల్ క్యాంపుల టైం షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ప్రకటించారు. 16.06.2026 నుండి 17.06.2026 వరకు YSVRM గర్ల్స్ జూనియర్ కాలేజీ నందు,18.06.2026 న భాష్యం ఇంగ్లీషు మీడియం స్కూల్ నందు,22.06.2026 న APSWR HS జూనియర్ కాలేజ్ బెస్తవారి పల్లి నందు, 23.06.2026 నుండి 24.06.2026 వరకు న్యూ వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు ఆయా విద్యాసంస్థలలో ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహించబడుతాయని కమిషనర్ తెలిపారు.కావున విద్యార్థులందరూ ఈ సదరు ఆధార్ నమోదు కేంద్రాల నందు తమ ఆధార్ సంబంధిత సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## దేశ సమైక్యతే జనసేన ధ్యేయం: అతికారి క్రిష్ణ




**సిద్ధవటం, మన జనప్రగతి, జూన్ 15:–** దేశ సమగ్రత, జాతీయ సమైక్యత పరిరక్షణే జనసేన పార్టీ ప్రధాన లక్ష్యమని రాజంపేట పార్లమెంటు జనసేన సమన్వయకర్త అతికారి క్రిష్ణ తెలిపారు. ఢిల్లీలో నిర్వహించిన “సేన ప్రస్థానం జాతీయ సమైక్యత కోసం” కార్యక్రమంలో జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన ప్రసంగం పార్టీ దేశభక్తి, జాతీయతకు నిదర్శనమని పేర్కొన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ జనసేన అధికారం కోసం కాకుండా దేశ సేవ లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగించే శక్తులను పార్టీ ఎప్పటికీ వ్యతిరేకిస్తుందని తెలిపారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజల సమస్యలపై జనసేన గళం వినిపిస్తుందని, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పార్టీ జాతీయ సమైక్యత, ప్రజా సంక్షేమం కోసం మరింత బలంగా ముందుకు సాగుతుందని అన్నారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ ర్యాలీ నేడు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 15:–** కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమ పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రొద్దుటూరులో మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.ఈ కార్యక్రమం మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రొద్దుటూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అక్కడి నుంచి శివాలయం సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.ఈ విజయోత్సవ కార్యక్రమం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, టీడీపీ యువ నాయకులు నంద్యాల కొండారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## అమావాస్య సందర్భంగా శ్రీ మానసాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



**సిద్ధవటం, మన జనప్రగతి జూన్ 15:–** కడపచెన్నై జాతీయ రహదారిపై భాకరాపేట సమీపంలోని శ్రీ మానసాదేవి ఆలయంలో అమావాస్య సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆలయ పూజారి శర్మ మాట్లాడుతూ అమావాస్య సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించినట్లు తెలిపారు. భక్తులు కోరిన కోర్కెలను తీర్చే కల్పవల్లిగా శ్రీ మానసాదేవిని కొలుస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లక్ష్మయ్యతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి మరింత ప్రాధాన్యత ఇవ్వాలి: వంగిమల్ల రంగారెడ్డి



**అన్నమయ్య జిల్లా,మన జనప్రగతి జూన్ 15:–** దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇచ్చి వారి ఆర్థిక, సామాజిక భద్రతకు అదనపు చర్యలు చేపట్టాలని వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగిమల్ల రంగారెడ్డి కోరారు.నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల కుటుంబాల్లోని యువతకు ప్రత్యేక ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్వయం ఉపాధి పథకాలను విస్తరించాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో దివ్యాంగులకు ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ గడిపూటి నారాయణస్వామి మాట్లాడుతూ, దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు పంపిణీ చేయడంతో పాటు వారి సమస్యలు, అవసరాలపై చర్చించారు.


## కొండపేట స్మార్ట్ కిచెన్ ట్రై ల్ రన్ను పరిశీలించిన డి ఆర్ డి ఏ పిడి రాజ్యలక్ష్మి




**చెన్నూరు మన జనప్రగతి జూన్ 15:–** చెన్నూరు మండలంలోని కొండపేట గ్రామంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ కిచెన్‌ను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి , మండల ప్రత్యేక అధికారి పరిమళ జ్యోతి తహశీల్దార్ విజయకుమారి ఎంపీడీవో కిరణ్ మోహన్ మరియు మండల విద్యాశాఖ అధికారి సునీత ఏపిఎం వెలుగు వెంకటేష్ సందర్శించారు. స్మార్ట్ కిచెన్ ప్రారంభమైన మొదటి రోజున కొండపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల (హై స్కూల్)కు చెందిన 70 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని తయారు చేసే విధానాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు, వంట ప్రక్రియ, భద్రతా చర్యలు మరియు విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతపై సమీక్ష నిర్వహించారు. స్మార్ట్ కిచెన్‌లో ఆధునిక పద్ధతుల ద్వారా పరిశుభ్రంగా, నాణ్యమైన భోజనాన్ని తయారు చేస్తున్న తీరుపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పోషకాహారం అందించడంలో స్మార్ట్ కిచెన్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అనంతరం సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు చేస్తూ, పరిశుభ్రత మరియు నాణ్యత ప్రమాణాలను నిరంతరం పాటించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహార భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

## డిగ్రీ కాలేజ్ రోడ్డు ఫీడర్ పరిధిలో నేడు విద్యుత్ నిలిపివేత

### - ఏఈఈ జగదీశ్వరరెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 15:–** పులివెందుల పట్టణంలో మంగళవారం ఉదయం 9 :00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఏఈఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ డిగ్రీ కాలేజ్ రోడ్డు లో ఫీడర్ క్రింద ట్రీ కటింగ్ పనులు చేపట్టనుండడంతో మెయిన్ బజార్, బక్రాపురం, ఓల్డ్ బస్టాండ్ నందు విద్యుత్ సరఫరా నిపివేశమని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహరించాలన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించండి

### - స్మార్ట్ కిచెన్ సెంటర్ పరిశీలనలో రమాదేవి




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 15:–** పులివెందుల పట్టణంలోని న్యాక్ బిల్డింగ్ సమీపంలో ఉన్న రమణప్ప సత్రం పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ కిచెన్ సెంటర్ ను మండల స్పెషల్ ఆఫీసర్ రమాదేవి పరిశీలించారు. సోమవారం రమణప్ప సత్రం పాఠశాల ఆవరణంలో సుమారు 45 లక్షలతో నిర్మించిన స్మార్ట్ కిచెన్ సెంటర్ ను ఎంఈఓ2 రామానాయుడు తో కలిసి పరిశీలించి పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. సందర్భంగా ఆమె స్మార్ట్ కిచెన్ సెంటర్లోని పరికరాలను పరిశీలించి విద్యార్థులకు అందించే భోజనానికి సంబంధించిన వంట పరికరాలను పరిశీలించారు. స్మార్ట్ కిచెన్ ద్వారా పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జూలై ఒకటి నుంచి స్మార్ట్ కిచెన్ ద్వారానే భోజనం సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సిడిపిఓ మా బున్నీ, డిఆర్డిఏ ఎపిఎం గురు రాజ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 సందర్భంగా పోస్టర్ తయారీ

### ● డైట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూన్ 15:–** అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 సందర్భంగా అన్నమయ్య, వైయస్సార్ కడప జిల్లాలకు చెందిన అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు “ఆరోగ్యానికి యోగా పాఠశాలలో యోగా“ (Yoga for Health Yoga at School) అనే అంశంపై పోస్టర్ తయారీ పోటీలు నిర్వహిస్తున్నట్లు డైట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం డైట్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూపాఠశాల స్థాయి పోటీలను జూన్ 15 నుండి 17వ తేదీ వరకు నిర్వహించి, ప్రథమ స్థానం సాధించిన ఒక్క విద్యార్థిని జూన్ 18న నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు పంపించాలని ఆయన సూచించారు. అన్నమయ్య జిల్లా విద్యార్థులకు రాయచోటి డైట్‌లో, వైయస్సార్ కడప జిల్లా విద్యార్థులకు కడప నగరంలోని సిఎస్ఐ పాఠశాల కాంపౌండ్ లో గల డిసిఈబి కేంద్రంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించబడతాయని తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో ఎంపికైన పోస్టర్లను ప్రదర్శించి, విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లతో పాటు అన్నమయ్య, వైయస్సార్ కడప జిల్లాలకు వేరువేరుగా ప్రథమ బహుమతి రూ. 1,000, ద్వితీయ బహుమతి రూ. 750, తృతీయ బహుమతి రూ. 500 చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు రెడ్డప్ప రెడ్డి, కేదార్నాథ్, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## పేద కుటుంబం నుంచి ప్రతిభా శిఖరాలకు అప్సనాకు పాఠశాలలో ఘన సన్మానం



**వాల్మీకిపురం మన జనప్రగతి జూన్ 15:–** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా కృషి, పట్టుదలతో ఉన్నత ఫలితాలు సాధించగలరని పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని పఠాన్ అప్సనా మరోసారి నిరూపించింది. ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 600 మార్కులకు గాను 576 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన ఆమె, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి అర్హత సాధించింది. వాయల్పాడు ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న పఠాన్ అప్సనా తండ్రి బాబ్జాన్ వృత్తిరీత్యా టైలర్‌గా పనిచేస్తుండగా, తల్లి ఖుషీదా గృహిణిగా కుటుంబాన్ని ఆదుకుంటున్నారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన అప్సనా తన కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో ఈ విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని ఎం. వసుంధర అధ్యక్షతన ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అప్సనాతో పాటు ఆమె తండ్రి బాబ్జాన్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా కష్టపడి చదివితే అత్యున్నత విజయాలను సాధించవచ్చని అన్నారు. పఠాన్ అప్సనా సాధించిన విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగితే భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని సూచించారు. అలాగే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం విద్యార్థుల విజయాల్లో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ ఎం. రామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు వసుమతి, నాగరాజు, శేఖర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, తార, ఉషాకుమారి, చెంగయ్య, ఖదీర్ భాష, రాజేంద్ర, సుజాత, మంగమ్మ, దుర్వాసుల నాయుడు, రవీంద్ర, పురుషోత్తం, అమర్నాథ్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు కిరణ్, విశ్రాంత ఉపాధ్యాయులు సివి రమణ తదితరులు పాల్గొన్నారు.

## 15లో 11 డిఎస్సీలు టీడీపీ ప్రభుత్వంలో తీసినవే

### - రద్దు చేసేందుకు అవి వాలంటరీ ఉద్యోగాలు కావు: ఎమ్మెల్సీ పేరాబత్తుల వెల్లడి




**కాకినాడ, మన జనప్రగతి జూన్ 15:–** ఇప్పటివరకు టీచర్ల నియామకం కోసం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల ఎంపికలలో 11 తమ టీడీపీ ప్రభుత్వ హయాంలో తీసినవేనని టీడీపీ నాయకులు వెల్లడించారు. ఎంతో కాలం కష్ట పడి చదివి టీచర్ ఉద్యోగాలు పొందిన వారిని రద్దు చేయిస్తానని వైసీపీ నేతలు చెప్పడం వారి అవివేకతనానికి నిదర్శమని వారు పేర్కొన్నారు. కాకినాడలో గోదావరి కళాక్షేత్రంలో 2025 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులతో పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాజశేఖర్ మాట్లాడుతూ తమ కూటమి ప్రభుత్వం డీఎస్సీని నిష్పక్షపాతంగా నిర్వహించిందన్నారు. ఉద్యోగాలు పొంది సుమారు 6 నెలలు దాటినా ఇప్పుడు వైసీపీ వారు అందులో అక్రమాలు జరిగాయని పేర్కొనడం పట్ల వారి అవివేకం బయటపడిందన్నారు. వైసీపీకి చెందిన మరి కొందరైతే డిఎస్సీ రద్దు చేస్తామని చెప్పి ఎంపికైన ఉపాధ్యాయులలో భయాందోళనలు సృష్టిస్తున్నట్లు పేర్కొన్నారు. వారు ఆరుగాలం కష్టపడి చదివి ఉద్యోగం సాధించారని వారు ఏ ప్రభుత్వ దయ దక్షిణాల మీద ఆధారపడలేదన్నారు. తీసి పడేయడానికి వారు చేస్తున్నవి వాలంటీర్ ఉద్యోగాలు కాదని రాజశేఖరం ఎద్దేవ చేశారు. ఇకనుంచి ప్రతి ఏడాది డీఎస్సీ, గ్రూప్ స్థాయి వంటి ఉద్యోగాలకు నియమాకం జరుగుతుందని పేరాబత్తుల చెప్పారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు)మాట్లాడుతూ డీఎస్సీలో అక్రమాలు జరిగాయని వైసీపీ వాళ్ళు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అక్రమాలు, అవ్వకతవకలపై విద్యాశాఖ కార్యదర్శి ఆధారాలు చూపించాలని కోరినా వారు అందుకు వెనుదిరిగిన సంఘటనను గుర్తు చేశారు. నాడు బి నేడు పేరుతో వైసీపీ గోడలకు రంగులు, సున్నాలు మాత్రమే వేసిందని టీచర్ ఉద్యోగాలు భర్తీ చేయలేదని చెప్పారు. వైసీపీ చేస్తున్న కుట్రలను తిప్పి వనమాడి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. అంతకుముందు డీఎస్సీలో ఉపాధ్యాయులు ఎంపికైన వారి అనుభవాలు, కష్టపడిన తీరులను సభకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ రవి, పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్ ప్రదీప్ కుమార్, ఎస్టియు జిల్లా అధ్యక్షుడు ఎన్ సత్యనారాయణ, నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి సూరిబాబు, సిపిఎస్ రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం రవికుమార్, పిఈటి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంగ రంగ వైభవంగా కార్యకర్తలు, అభిమానులు నడుమ గడికోట శ్రీకాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు







**రామాపురం మన జనప్రగతి జూన్ 15 :–** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు రామాపురంలోని వైఎస్సార్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై శ్రీకాంత్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి హాజరై కేక్ కట్ చేసి సంబరాల్లో పాల్గొన్నారు. పార్టీ జెండాలు, బ్యానర్లతో కార్యాలయ ప్రాంగణం కళకళలాడగా, కార్యకర్తల నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుడిగా గడికోట శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవ, పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని కొనియాడారు. మండలములోని అన్ని గ్రామాల నుంచి తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు శ్రీకాంత్ రెడ్డి పై తమ అభిమానాన్ని చాటుకున్నారు. భారీ సంఖ్యలో హాజరైన నాయకులు, కార్యకర్తలతో పార్టీ కార్యాలయం కిక్కిరిసిపోయింది. జన్మదిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగి విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీకాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు రామాపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి.

## శివాల పల్లి శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో వైభవంగా అమావాస్య అభిషేక పూజలు



**చెన్నూరు మన జనప్రగతి జూన్ 15:–** చెన్నూరు మండలం శివాల పల్లి జింకల వంక ప్రక్కన వెలసిన శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామి( ఉరుకుంద ఈరన్న స్వామి) ఆలయంలో అమావాస్య అభిషేక పూజలు సోమవారం అమావాస్య కావడంతో స్వామివారికి అత్యంత ప్రీతిమైనా రోజు కావడంతో ఉదయం పంచామృత పంచా బి షేకం ఆలయ అర్చక పురోహితులు కిరణ్ కుమార్ శర్మ వేదమంత్రాలతో ఉభయ దాతలు గోటూరు పార్వతమ్మ కొండయ్య వారి కుటుంబ సభ్యులచే వైభవంగా నిర్వహించారు . స్వామివారికి వస్త్రాలు పూలు నైవేద్యం సమర్పించారు వస్త్ర ప్రత్యేక పూల అలంకరణ నిర్వహించిన అనంతరం పూజలు జరిగాయి . ఈ కార్యక్రమం ఉభయ దాతలు గోటూరు పార్వతమ్మ కొండయ్య వారి కుటుంబ సభ్యులు ఆలయ వ్యవస్థాపకులు పొట్టి పా టి ప్రతాప్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు చేతులు మీదుగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు అమావాస్య రోజు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు .

## అవినీతి జరిగిందని నిరూపిస్తే జైలుకు వెళ్తా ..: రాచమల్లు బహిరంగ సవాల్




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 15:–** జగనన్న కాలనీల నిర్మాణం, ఇళ్ల స్థలాల కొనుగోలు వ్యవహారాల్లో తనపై చేస్తున్న అవినీతి ఆరోపణలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రొద్దుటూరులో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగనన్న కాలనీల నిర్మాణంలో రూ. 100 కోట్ల దోపిడీ జరిగిందన్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ప్రొద్దుటూరులో 23 వేల మంది లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరిగిందని తెలిపారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్వహించిన డోర్ టు డోర్ సర్వే, అనంతరం అధికారుల కంప్యూటర్ స్క్రీనింగ్ ప్రక్రియ ద్వారా అర్హులను ఎంపిక చేశారని వివరించారు. ఇందులో రాజకీయ నాయకుడిగా తన ప్రమేయం ఏమాత్రం లేదన్నారు. ఇళ్ల స్థలాల కోసం 468 ఎకరాల భూముల కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ పర్యవేక్షించిందని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే రైతులతో చర్చించి ధరలు నిర్ణయించారని, చెల్లింపులు నేరుగా రైతుల ఖాతాల్లోనే జమయ్యాయని తెలిపారు. తాను కమిషన్లు తీసుకున్నానని చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమన్నారు. ఇళ్ల నిర్మాణ బాధ్యత పూర్తిగా హౌసింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణలోనే జరిగిందని పేర్కొన్నారు. విమర్శకులు చెబుతున్న 11 మంది కాంట్రాక్టర్లలో కేవలం ఇద్దరు మాత్రమే తన అనుచరులని, మిగిలిన వారు టీడీపీ లేదా తటస్థ వ్యక్తులని తెలిపారు. తన అనుచరులు ఎవరైనా తప్పు చేసి ఉంటే చర్యలు తీసుకోవచ్చని సవాల్ విసిరారు. గతంలో పెనమలూరు నియోజకవర్గంలో కూడా వేలాది మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని, అక్కడ భూముల కొనుగోలు ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయని పత్రికా ఆధారాలను చూపించారు. పేదలకు ఇళ్ల స్థలాలు అందించాలనే లక్ష్యంతోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేసిందన్నారు. భూముల కొనుగోలుపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ జరిగి ఎలాంటి అక్రమాలు లేవని తేలిందని రాచమల్లు తెలిపారు. అయినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వానికి అనుమానాలు ఉంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ తనపై ఆరోపణలు నిజమని నిరూపితమైతే ఆరు నెలలు జైలుకు వెళ్లడానికైనా సిద్ధమని బహిరంగ సవాల్ విసిరారు. మంత్రి పార్థసారథి రెండు గంటలు వచ్చి వెళ్లడం వల్ల నిజాలు బయటపడవని, రెండు రోజులు ప్రొద్దుటూరులో ఉండి మీడియా, లబ్ధిదారులు, రైతులు, కాంట్రాక్టర్లు, అధికారుల సమక్షంలో బహిరంగ విచారణ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పుడు అవినీతి జరిగిందా లేదా అన్నది ప్రజల ముందే తేలిపోతుందని అన్నారు.

మనజనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
16 - 06 - 2026

## శివోహం సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం

**- రామేశ్వరం మూలస్వామి ఆలయంలో ఘనంగా అన్నప్రసాద వితరణ**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 15:-** స్థానిక రామేశ్వరం ప్రాంతంలోని శ్రీ కాశీ హనుమత్ లింగేశ్వరస్వామి (మూలస్వామి) దేవాలయంలో సోమవారం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణానికి చెందిన జూటూరు మదుసూధన రావు, లక్ష్మీ కుమారి దంపతులు తమ కుమారులు సాయి కౌశిక్, రిషి ఆర్యల సహకారంతో ముఖ్య దాతలుగా వ్యవహరించారు. వారి సహకారంతో సిద్ధం చేసిన స్వచ్ఛమైన అన్నప్రసాదాన్ని వందలాది మంది భక్తులకు పంపిణీ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, సమాజ సేవే లక్ష్యంగా భక్తులకు నిరంతరం అన్నప్రసాద సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆలయాల్లో నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు భక్తి భావనతో పాటు సేవా దృక్పథాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, విష్ణు నారాయణతో పాటు పలువురు భక్తులు, దాతలు పాల్గొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## మీఇంటికి వస్తున్నాం "ఎస్ఐఆర్"

**- ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే ప్రారంభం**





**లింగాల మన జనప్రగతి జూన్ 15:-** రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) ఎస్ఐఆర్ లో భాగంగా సోమవారం నుంచి లింగాల మండలం పరిధిలోని గ్రామాల్లో ఇంటింటా సర్వే ప్రారంభమయింది. మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీల్లో 31 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు వీటికి సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక బిఎల్ఓ ను నియమించినట్లు తాసిల్దార్ బి రామచంద్రుడు సోమవారం తెలిపారు. బిఎల్ఓ (బూత్ లెవెల్ ఆఫీసర్ ), రాజకీయ పార్టీలు నియమించుకున్న బిఎల్ఎ (బూత్ లెవెల్ ఏజెంట్ ) లతో కలిసి మండల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాలో పేర్లను సారి చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో 2002లో చివరిసారిగా ఎస్ఐర్ (సర్) జరిగింది. తిరిగి మళ్లీ 24 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ విడత లోనే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే జరుగుతోంది. మండలంకు చెందిన ఓటర్లలో కొందరు ఉపాధి కోసం హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకు వలస వెళ్లడంతో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్న ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉంది. కాబట్టి ఈరోజు నుంచి మండలంలో జరిగే ఎస్ఐఆర్ లో ఓటు హక్కును కాపాడుకునే బాధ్యత ఆయా ఓటర్ల పైనే ఉంది. ఎస్ఐఆర్ అత్యంత కీలకమైనది. ఓటర్ మ్యాపింగ్ 2002 ఎస్ఐఆర్ తర్వాత ప్రకటించిన తుది ఓటరు జాబితాలో 2024 ఓటర్ల జాబితాను మ్యాపింగ్ చేస్తున్నారు. 2024 ఓటరు జాబితాలో ఓటు హక్కు ఉన్నవారు 2002 ఓటర్ల జాబితాలో ఓటు హక్కు కలిగి ఉండటం లేదా వారి తల్లిదండ్రులు,సమీప బంధువుల ఓటు హక్కు ఉంటే వాటితో మ్యాపింగ్ చేస్తారు. ఇలా మ్యాపింగ్ జరిగిన ఓట్లు కొనసాగుతాయి. జూన్ 14న మధ్యాహ్నంతో మ్యాపింగ్ కార్యక్రమాన్ని ముగించారు. మ్యాపింగ్ పూర్తయిన వారు ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదు . ఇప్పటికీ రాష్ట్రంలో ఎన్నిసార్లు ఎన్నికల్లో పాల్గొన్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సందర్భంగా విధిగా ఎన్యుమరేషన్ ఫారం పూర్తి చేసి ఇవ్వాల్సిందే, ఆ ఫారాలు సకాలంలో ఇచ్చిన వారి ఓట్లు మాత్రమే కొనసాగుతాయి. **ఎన్యు మరేషన్ ఫారం, ఫోటో తప్పనిసరి:** సర్ ప్రక్రియలో బిఎల్ఓ కీలక పాత్ర పోషించనున్నారు. ప్రతి పోలింగ్ బూత్ కు ఒక బిఎల్ఓ ను నియమించారు. ఇంటింటా సర్వే సమయంలో బిఎల్ఓ ప్రతి ఓటర్ ఎన్యుమరేషన్ ఫారం ఇస్తారు. మ్యాపింగ్ పూర్తయిన ఓటర్ వివరాలను ముద్రించిన ఎన్యుమరేషన్ ఫారం ఇస్తారు.

దానిపై ఈ మధ్యనే తీయించుకున్న ఒక కలర్ ఫోటో అతికించి ఇస్తే సరిపోతుంది. మ్యాపింగ్ పూర్తికాని వారికి ఖాళీ ఎన్యుమరేషన్ ఫారం ఇస్తారు. ఆధార్,మొబైల్ నెంబర్ తో పాటు తల్లి/ తండ్రి లేదా సమీప బంధువుల ఓటరు ఐడి నంబర్లను అందులో పేర్కొనాలి. మ్యాపింగ్ కానివారు కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన 11 ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకటి విధిగా సమర్పించాల్సి ఉంటుంది. ఇలా ఇచ్చిన సమాధానంతో బిఎల్ఓ సంతృప్తి చెందితేనే మీ ఓటు కొనసాగుతుందని లింగాల తహసిల్దార్ బి.రామచంద్రుడు తెలిపారు.

## జనం దూరమౌతున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

**- ఉరవకొండలో కేవలం 8 అర్జీలు మాత్రమే!**



**ఉరవకొండమన జనప్రగతి జూన్ 15:-** పట్టణంలో ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి వారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ఉరవకొండ మండల కేంద్రంలో నానాటికి పలుచబడుతోంది. 55 వేలకు పైగా జనాభా ఉండి, నిత్యం ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఉరవకొండ పట్టణంలో.. ఈ వేదికకు వస్తున్న అర్జీల సంఖ్య ఘోరంగా పడిపోవడం చర్చనీయాంశంగా మారింది. **సమస్యలు కొండంత.. అర్జీలు గోరంత!** తాజాగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి కేవలం ఎనిమిది (8) అర్జీలు మాత్రమే రావడం గమనార్హం. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడం, తాగునీటి ఎద్దడి, వీధి దీపాల సమస్యలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు వంటి పౌర సమస్యలు వెల్లువలా ఉన్నప్పటికీ, అధికారులు నిర్వహిస్తున్న ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జనం రావడం తగ్గించేశారు. **నమ్మకం కోల్పోతున్నారా..?** వారాల తరబడి అర్జీలు ఇస్తున్నా స్థానిక అధికారులు వాటిని పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే అసంతృప్తి ప్రజల్లో వ్యక్తమవుతోంది. కేవలం కాగితాలకే పరిమితమవుతున్న అర్జీల వల్ల ఫలితం లేదనే భావనతోనే జనం ఈ వేదికకు రావడం తగ్గించేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. 55 వేల జనాభా ఉన్న పట్టణ కేంద్రంలో కేవలం 8 అర్జీలు రావడం అధికారుల పనితీరుకు, ప్రజా సమస్యల పట్ల వారికున్న ఉదాసీనతకు అద్దం పడుతోందని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, వచ్చిన అర్జీలపై తక్షణ చర్యలు తీసుకుని, ఈ వేదికపై ప్రజల్లో మళ్లీ నమ్మకం కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మా మామ అంటూ దందాచేస్తున్న శెట్టి నాగరాజు యాదవ్ పై చర్యలు తీసుకోవాలి : బాధితుడు సివి రమణయ్య



**కడప మన జనప్రగతి జూన్ 15:-** నేను చేసిందే వేదమంటూ పైరవీలు చేస్తున్న శెట్టి నాగరాజు యాదవ్ పై చర్యలు తీసుకోవాలని సివి రమణయ్య ఆరోపించారు. సోమవారం ఈ సందర్భంగా కడప నగరం వైయస్సార్ ప్రెస్ క్లబ్ లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కడప జిల్లా దువ్వూరు గ్రామపంచాయతీ 21వ బూత్ కన్వీనర్ గా ఉన్న శెట్టి నాగరాజు యాదవ్ చేస్తున్న అరాచకాలకు సామాన్య ప్రజలుఅమాయకు లు బలి అయిపోతున్నారన్నారు. శెట్టి నాగరాజుయాదవ్ కు ప్రభుత్వాలతో ఎన్ని ఉన్న ఏ ప్రభుత్వం వచ్చినా ఆయనకు అడ్డు ఆదుపు లేకుండా పోతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం ఉన్నప్పుడు వైఎస్ఆర్ నాయకులతో తిరుగుతూ ఆ ప్రభుత్వంలో పని చేస్తున్న అధికారులదగ్గర నీచ్యానికిదిగజారి లంగాగిరి చేస్తూ భూములు రికార్డులను మార్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం లోనైనా అతని తీరు మారుతుందని,మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ శెట్టి నాగరాజును కొన్ని కార్యక్రమాలకు దూరంగా పెట్టిన అతను మాత్రం ప్రభుత్వ ఆఫీసుల్లో పోయి సుధాకర్ యాదవ్ నా బంధువు నా కులము అని చెప్పుకుంటూ పైరవీలు దందాలు చేస్తూ అక్రమ బియ్యం వ్యాపారస్తులకు కొమ్ము కాస్తూ అతనే ఎలాంటి పర్మిషన్ లేకుండా ఎర్ర గ్రావెల్ దందా చేస్తూ భూములను ఎలాంటి ఆధారం లేకుండా వారికి భూములు ఎక్కి స్తూ రిజిస్ట్రేషన్ చేపిస్తూ నేను చెప్పిందే వేదం అంటూ తిరుగుతూ చలామణి అవుతున్నారన్నారు. నాభూములుకూడా కబ్జా చేశారన్నారు. అతని పై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

## ఆర్ఓబి పనుల జాప్యంపై జాయింట్ కలెక్టర్ కు ఫిర్యాదు



**పీలేరు మన జనప్రగతి జూన్ 15:-** పీలేరు పట్టణంలో జరుగుతున్న జాతీయ రహదారి (హైవే) ROB NH/40 మరియు NH /71 పనుల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తగిన చర్యలు తీసుకోవాలని మదనపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పీలేరు రెవిన్యూ డివిజన్ సాధన కమిటి ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ శ్రీ శివ్ నారాయణ్ శర్మ ఫిర్యాదు చేశారు చేశారు. ఈ సందర్బంగా పీలేరు రెవిన్యూ డివిజన్ సాధన కమిటి సభ్యులు మాట్లాడుతూ పీలేరు పట్టణం గుండా మదనపల్లి - తిరుపతి, కడప - చిత్తూరు, వెళ్లే జాతీయ రహదారి విస్తరణ (ROB) NH/40 మరియు NH/71 మరియు నిర్మాణ పనులు గత 2022 వ సంవత్సరం నుండి సుమారుగా 5 సంవత్సరాల కాలంగా సాగుతున్నాయి పనుల నిర్వహణలో కాంట్రాక్ట్ సంస్థ కనీస నియమాలు మరియు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల స్థానిక ప్రజలు,వ్యాపారస్తులు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పనులను త్వరగా నాణ్యతతో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పీలేరు రెవిన్యూ డివిజన్ సాధన కమిటి సభ్యులు ఫిర్యాదు చేశారు స్పందించిన జాయింట్ కలెక్టర్ సంబంధిత కాంట్రాక్టర్కు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు అన్నారు కార్యక్రమంలో నడిమి కండ్రిగ సుధాకర్ బాబు, తుమ్మల ధరణ్ కుమార్, జెట్టి మల్లికార్జున, కె. ఆనంద్, నగిరి మడుగు సుభాష్, తదితరులు పాల్గొన్నారు

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి: జిల్లా ఎస్.పి తుషార్ డూడి



**చిత్తూరు బ్యూరో మన జనప్రగతి జూన్ 15 :-** ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్.పి తుషార్ డూడి, ఆదేశించారు. "ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పని చేయాలి" తెలిపారు .జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, నేరుగా ఎస్.పి , నాన్-కేడెర్ ఎస్పీ రాజశేఖర్ రాజు ఎస్ డి పి ఓ చిత్తూరు జె.వెంకటనారాయణ కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. "ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే మా లక్ష్యం" అని ఎస్.పి అన్నారు. లిఈ ఫిర్యాదులపై తక్షణ చర్య తీసుకొని ప్రజలు న్యాయం పొందేలా చూడాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని ఎస్.పి మరోసారి గుర్తు చేశారు.

## జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం

**తొండూరు మన జనప్రగతి జూన్ 15 :-** మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యందు డాక్టర్ గవాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పల్స్ పోలియో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 26 వ తేది జరిగే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం పై వ్యాక్సినేటర్లు, పోలియో బూత్ సిబ్బంది కి పోలియో కార్యక్రమం గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు . అప్పుడే పుట్టిన బిడ్డల నుండి 5 సంవత్సరముల వయస్సు కల్గిన పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, మొదటి రోజునే పిల్లలందరికీ పోలియో బూత్ లోనే వంద శాతం పూర్తిచేయాలని. రెండవ. మూడవ రోజు ఇంటింటి దర్శనాల ద్వారా చుక్కలు వేయించుకొని పిల్లలను గుర్తించి చుక్కలు వేయాలన్నారు, వ్యాక్సిన్ శీతలీకరణ యందు ఉండునట్లు చూడాలని. బూత్ లో సభ్యులందరూ తప్పనిసరిగా ఉదయం 7 గంటల నుండే పోలియో చుక్కలు వేయాలని తెలిపారు .రూట్ సూపర్ వైసర్లు కార్యక్రమ సరళిని పరిశీలించాలని ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని తెలిపారు. వంద శాతం లక్ష్య సాధన దిశగా సిబ్బంది పనిచేయాలని తెలిపారు. ఈ శిక్షణలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మల్లయ్య,రూట్ సూపర్ వైసర్లు విజయ, శీభారాణి, అంగన్వాడీ సూపర్ వైసర్ వసంత కుమారి,ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్2026 ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నాం: కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు,మన జనప్రగతి జూన్ 15:-** రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)2026 ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూన్ 15 నుంచి జూలై 14 వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను సేకరించనున్నట్లు చెప్పారు. జూలై 21న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి, అభ్యంతరాలు, సూచనలను పరిశీలించిన అనంతరం సెప్టెంబర్లో తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. మరణించిన ఓటర్లు, ద్వంద్వ నమోదులు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను గుర్తించి జాబితాను మరింత ఖచ్చితంగా రూపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు ఎన్నికల ప్రక్రియలో చురుకుగా భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ ద్వారా అందిన ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలి

**- జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ**



**మదనపల్లి మన జనప్రగతి జూన్ 15:-** పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రజల సంతృప్త స్థాయి పెరిగేలా త్వరితగతిన నాణ్యతగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. జేసీ తోపాటు సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్డిసి మాధవ కృష్ణారెడ్డి, డిడిఓ లక్ష్మీపతి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్దాం: ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు




**చిత్తూరు మన జనప్రగతి జూన్ 15:-** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం చెప్పాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కూటమి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం చిత్తూరు జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన "సూపర్ సిక్స్ సూపర్ హిట్" విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ, 2029 ఎన్నికలే లక్ష్యంగా కూటమి శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో రెండేళ్ల కూటమి పాలనలో అన్ని రంగాల్లో పురోగతి సాధించామని, సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ సందర్భంగా వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమ అనుభవాలను పంచుకున్నారు. చిత్తూరు అభివృద్ధికి ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చేస్తున్న కృషిని ఎంపీ అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
16 - 06 - 2026

# యాదవులపై దాడిని ఖండిస్తూ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన

## బీసీ రక్షణ చట్టం తక్షణమే అమలు చేయాలని డిమాండ్





**ఒంగోలు,మన జనప్రగతి జూన్ 15:–** ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఎదుట యాదవ సామాజిక వర్గం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో యాదవులపై జరిగిన దాడిని వక్తలు తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమానికి చల్లా హరిబాబు, మెరియం శీను అధ్యక్షత వహించారు.సమావేశంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బీసీ రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగానే బీసీలకు రక్షణ కల్పించే ప్రత్యేక చట్టం అవసరమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు.ఇటీవల ఈదుమూడిలో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ, ఆ సంఘటన నుంచే బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేస్తూ సంబంధిత నిబంధనల కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. హత్యాయత్నానికి పాల్పడిన వారిపై నూతన చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.గొర్రెలు, మేకలు మరియు పశువుల పెంపకందారుల సమస్యలను ప్రస్తావించిన నాయకులు, ప్రతి గ్రామపంచాయతీలో పశువుల పోరంబోకు భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే కేటాయించిన భూములు అన్యాక్రాంతమైతే వాటిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని అర్హులైన పశు పోషకులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.దాడిలో గాయపడిన బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై నమోదు చేసిన సెక్షన్లనే, ప్రత్యర్థులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా బాధితులపైనా నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని పలువురు సభాముఖంగా ప్రశ్నించారు. అధికారులు అన్ని వర్గాల మనోభావాలను గౌరవిస్తూ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యాదవ ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ చైర్మన్ మద్దుల వెంకట కోటయ్య యాదవ్, రాష్ట్ర నాయకులు పీఎల్పీ యాదవ్, వెంగళరావు యాదవ్, కొలుసు మోహన్ యాదవ్, నాగార్జున యాదవ్, బంక చిరంజీవి యాదవ్, రాజా ధనవర్మ యాదవ్, రామారావు యాదవ్, సుబ్బారావు యాదవ్, ఒంటేరు నాగేశ్వరరావు యాదవ్, అల్లంరాజు శ్రీనివాస్ యాదవ్, మెట్ల చెంచయ్య యాదవ్, బుర్రి బుల్లెట్ శ్రీను యాదవ్, బుర్రి వెంకీ యాదవ్, బోరి గొర్ల అజయ్ యాదవ్, నరసింహ యాదవ్, మూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా యాదవ సంఘాల ప్రతినిధులు, న్యాయవాదులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక నాయకులు, ఎంఆర్పీఎస్ ఉద్యమకారులు, మహిళా నాయకురాలు రాజ్యలక్ష్మి యాదవ్‌తో పాటు పలువురు మహిళలు హాజరయ్యారు. బాధిత గ్రామానికి చెందిన సుమారు 300 మంది యాదవులు, గుంటూరు జిల్లా పెదనందిపాడు నియోజకవర్గం నుంచి వచ్చిన యాదవులు, గొర్రెలు, మేకల పెంపకందారులు మరియు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన యాదవ నాయకులు పాల్గొన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో సుమారు 500 మంది పైగా యాదవ సోదరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

# వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించండి–ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించండి: కమిషనర్ పి నరసింహ ప్రసాద్



**చిత్తూరు బ్యూరో మన జనప్రగతి జూన్ 15 :–** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అందే వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కమిషనర్ పి నరసింహ ప్రసాద్ చెప్పారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీజీ ఆర్ఎస్ కార్యక్రమంలో అందే వినతులను క్షేత్రస్థాయిలో విచారించి, పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గతవారం అందిన వినతుల పరిష్కారంపై సమీక్షించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీరింగ్ – 1, ప్లానింగ్ –1, పింఛన్లు –1 చొప్పున మొత్తం 3 వినతులు అందాయి. కార్యక్రమంలో ఎంహెచ్వో డా.పి.లోకేష్, ఏసీపీ నాగేంద్ర, ఇన్చార్జి ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.ద

# వాల్మీకుల కల ఎస్టీ పునరుద్ధరణ హామీని నెరవేర్చాలి

- వాల్మీకుల కన్నీటి ధారను ఆపండి సీఎం సార్
- వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు



**మదనపల్లె, మన జనప్రగతి జూన్ 15 :–** జూన్ 20వ తేదీన జలధార కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా మదనపల్లికి విచ్చేయుచున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఏపీలోని 50 లక్షల వాల్మీకుల కన్నీటి ధారను ఆపాలని,వాల్మీకులకు ఇచ్చిన హామీ వాల్మీకి ఎస్టి పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక అన్నమయ్య జిల్లా కలెక్టర్ కు వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు,సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పులి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో వాల్మీకులు ఎలాంటి అభివృద్ధిని నోచుకోక ఆంధ్రప్రదేశ్లో గిరిజన తెగకు చెందిన వాల్మీకి బోయలు విద్యా,ఉద్యోగ,రాజకీయ,ఆర్థిక,సామాజిక,సాంస్కృతిక రంగాలలో నేటికీ అత్యంత వెనుకబాటుతనానికి గురై ఉన్నామని గతంలో అనేక రాష్ట్ర కమిటీలు అధ్యయనం చేసి నివేదికలు ఇవ్వడం జరిగిందన్నారు.తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో వాల్మీకి/బోయల ఎస్టీ పునరుద్ధరణ బాధ్యత తనదేనని వాల్మీకి బోయలకు హామీ ఇవ్వడం జరిగిందని,కానీ నేటికీ హామీని నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు.అందువల్ల వాల్మీకి బోయలు అన్ని రంగాలలో వెనుకబాటుతనానికి గురై 50 లక్షల వాల్మీకుల కన్నీరు నేడు ధారలుగా ప్రవహిస్తున్నదని చంద్రబాబు నాయుడు వాల్మీకులకు ఇచ్చిన హామీని నెరవేర్చి వాల్మీకుల కన్నీటి ధారను ఆపాలని డిమాండ్ చేశారు.అలాగే మదనపల్లిలో చిత్తూరు బస్టాండ్ ప్రక్కన ఉన్న వాల్మీకి కూడలిని అధికారికంగా వాల్మీకి కూడలిప్రకటించాలని దశాబ్దాల వాల్మీకుల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు సభ్యుల సద్దల జయసింహా,రాష్ట్ర సలహాదారుడు కొత్తవుడుం శేఖర,అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలు అనురాధ,మదనపల్లి టౌన్ యువత అధ్యక్షుడు ముక్కండ్ల జగదీష్,గౌతమీ నగర్ అధ్యక్షురాలు అరవ నిర్మలమ్మ,పారపట్ల నరసింహులు,బొంత రామకృష్ణ,గాయత్రి,రేణుక,హృదయ,మైథిలి తదితరులు పాల్గొన్నారు

# రాజంపేటలో టీడీపీ వర్సెస్ టీడీపీ

## స్థానిక సంస్థల ఎన్నికల వేళ పసుపు పార్టీలో వర్గపోరు తీవ్రం

## సీనియర్ల అసంతృప్తి.. కొత్త నాయకత్వంపై విమర్శలు

## పరిస్థితిని గమనిస్తున్న వైసీపీ - జనసేన




**రాజంపేట, మన జనప్రగతి, జూన్ 15:–** రాజంపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ శ్రేణుల్లో నెలకొన్న వర్గపోరు కార్యకర్తలు, నాయకుల్లో ఆందోళనకు గురిచేస్తోంది. ఒకవైపు అధికార పార్టీలోనే అసంతృప్తి స్వరాలు వినిపిస్తుండగా, మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయిలో తన బలాన్ని పెంచుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేసిన సీనియర్ నాయకులకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదనే అభిప్రాయం కొందరిలో వ్యక్తమవుతోంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా తమకు కనీస గౌరవం, గుర్తింపు లభించడం లేదని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గతంలో పార్టీకి దూరంగా ఉన్నవారికి, వైసీపీ నుంచి వచ్చిన నాయకులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పార్టీ అధిష్టానం నియమించిన నాయకత్వంపై కూడా విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ నిర్ణయించిన ఇన్‌చార్జ్ నాయకత్వంలో అందరూ పనిచేయాల్సిందేనని ఒక వర్గం వాదిస్తుండగా, మరో వర్గం మాత్రం స్థానిక పరిస్థితులను అర్థం చేసుకుని అందరినీ కలుపుకొని వెళ్లగల సమర్థుడికి బాధ్యతలు అప్పగించాలని కోరుతోంది. 2019 ఎన్నికల్లో పార్టీ ఓటమి అనంతరం నియోజకవర్గ రాజకీయాల్లో చోటుచేసుకున్న పరిణామాలు ఇప్పటికీ ప్రభావం చూపుతున్నాయని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీని సమర్థవంతంగా నడిపించిన నాయకుడికి టికెట్ ఇవ్వకపోవడం, చివరి నిమిషంలో కొత్త అభ్యర్థిని బరిలోకి దించడం, అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలు ప్రస్తుతం కనిపిస్తున్న విభేదాలకు కారణమయ్యాయని కొందరు నేతలు అభిప్రాయపడుతున్నారు. పార్టీలో కొనసాగుతున్న వర్గపోరు కారణంగా గ్రామస్థాయి కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. పార్టీ బలోపేతం కంటే వ్యక్తిగత విభేదాలే ఎక్కువగా కనిపిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఈ పరిస్థితి పార్టీకి నష్టంగా మారే అవకాశం ఉందనే ఆందోళన కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. కూటమి భాగస్వామ్య పార్టీ అయిన జనసేన ప్రస్తుతం నిశ్శబ్ద వైఖరి అవలంబిస్తున్నట్లు కనిపిస్తోంది. పార్టీ కమిటీలు పూర్తిస్థాయిలో ఏర్పడే వరకు పెద్దగా రాజకీయ కార్యకలాపాలు నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు. అదే సమయంలో వైసీపీ మాత్రం గ్రామ గ్రామాన అభ్యర్థులను గుర్తించి సంస్థాగతంగా బలోపేతం అయ్యే దిశగా అడుగులు వేస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తున్న టీడీపీ కార్యకర్తలు, నాయకులు అధిష్టానం త్వరగా జోక్యం చేసుకుని విభేదాలకు ముగింపు పలకాలని కోరుతున్నారు. వర్గాలకు అతీతంగా అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీని ముందుకు నడిపించే నాయకత్వాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# పులివెందుల ఫుడ్ టెక్నాలజీ కళాశాలలో ఘనంగా కాలేజ్ అండ్ హాస్టల్ డే వేడుకలు









**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 15:–** స్థానిక ఆహార సాంకేతిక కళాశాల (కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) నందు కాలేజ్ అండ్ హాస్టల్ డే వేడుకలు సోమవారం (జూన్ 15) అత్యంత వైభవంగా జరిగాయి.విశ్వవిద్యాలయ అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ ఎమ్.వి.రమణ అధ్యక్షతన ఈ కార్యక్రమం ప్రారంభమైంది.విశ్వవిద్యాలయ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ డి.సంపత్ కుమార్ (గౌరవ అతిథి),బెంగళూరు ఇండస్ వెజ్ ప్రో ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఏ.రమేష్ (విశిష్ట అతిథి)విచ్చేశారు.అలాగే పులివెందుల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.రామారావు,ఒంగోలు ఆహార భద్రతా అధికారి (పూర్వ విద్యార్థి)వి.శివతేజ గౌరవ అతిథులుగా హాజరయ్యారు.ప్రస్తుత కాలంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అత్యంత కీలకమైనదని, కళాశాలలోని అత్యాధునిక వనరులను,ప్రయోగశాలలను ఉపయోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని డీన్ డాక్టర్ సంపత్ కుమార్,డీన్ డాక్టర్ ఎమ్.వి. రమణ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు.కళాశాల ప్రగతి గురించి అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్.మాధవ,హాస్టల్ నివేదికను వార్డెన్ డాక్టర్ శ్రీకాంత్ సభలో చదివి వినిపించారు.ఈ వేడుకల్లో భాగంగా ఉత్తమ విద్యార్థి అవార్డు గ్రహీత కుమారి ఎ.కావ్య ప్రియ,ఉత్తమ ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్ కె.హర్షవర్ధన్ రెడ్డి లతో పాటు వివిధ క్రీడలు,సాంస్కృతిక పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు,సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల స్టూడెంట్ యాక్టివిటీ అధికారి డాక్టర్ కీర్తి రెడ్డి,అధ్యాపక బృందం (డాక్టర్ అరుణ,డాక్టర్ జయమ్మ,డాక్టర్ రాజేష్,ఇంజినీర్ నజ్మా తదితరులు సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని,ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# 18న కడపలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై జిల్లా స్థాయి సభ




**కడప మన జనప్రగతి జూన్ 15:–** సంక్షేమం, అభివృద్ధి రెండు ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వ ధ్యేయం అని కడప జిల్లా టిడిపి అధ్యక్షులు భూపేష్ రెడ్డి తెలిపారుకడప జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం ప్రతి జిల్లా కేంద్రంలో విజయోత్సవ సభలు.చెప్పిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం.వైకాపా హయాంలో దెబ్బతిన్న వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం.ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నారా లోకేష్.జిల్లాలో గ్రీన్ ఎనర్జీ ద్వార పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి.కొప్పర్తికి నిధులు కేటాయించడం, జెఎస్డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా అడుగులు.స్టీల్ ఫ్యాక్టరీ పనుల పర్యవేక్షణకు త్వరలో సీఎం రాబోతున్నారు.సలహాలు సూచనలు ఇవ్వాల్సిన వైసీపీ నిందారోపణలు చేయడం సరికాదు..కమలాపురం వంతెన విషయంలో స్వంత జిల్లాలో పనులకు అడ్డంకులు సృష్టించిన పార్టీ వైసీపీ.బురద జల్లడం వైకాపాకు తగదు.నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటు చేసే దిశగా అడుగులు చర్చకు సిద్ధం.. మీరు సిద్ధమా ,జాతీయ రహదార్లు, జరుగుతున్న అభివృద్ధిపై చర్చకు సిద్ధం డిఏస్సీ వ్యవహారంలో ఇంటర్వ్యూ ఇవ్వడం పోజులు కొట్టడం సిగ్గు చేటు.అమరావతి నిర్మాణం శరవేగంగా సాగుతోంది.కూటమి హయాంలో జరుగుతున్న అభివృద్ధి యువత గ్రహించాలి.గ్యాస్ సిలిండర్ లపై అసత్య ప్రచారం తగదు.ఎంపీ కడప జిల్లాలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలి.సామాన్యులకు అందుబాటులో ఇసుక తెచ్చాం సహజ వనరుల దోపిడీ చేసిందే వైసీపీ హయాంలో2027–28నాటికి స్టీల్ ఫ్యాక్టరీని పూర్తి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించబోతున్నాం ముద్దనూరు పులివెందుల రోడ్డు, జమ్మలమడుగు పనులు ఎందుకు ఆగిపోయాయి.సోలార్ పవర్ ద్వారా ఉపాధి ఉద్యోగ అవకాశం కల్పించాం.మీ హయాంలో మీ ఆస్తులు పదవులు సంపాదించుకున్నారే తప్ప ఒక్క పరిశ్రమైనా తెచ్చారా,పదే పదే ఫేక్ ప్రచారాలను వాస్తవాలుగా ప్రచారం చేయడం సిగ్గుచేటు.ఎన్ని ఫేక్ ప్రచారాలు చేసిన వైసీపీ ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. ఈ సమావేశంలో టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు హరి ప్రసాద్, ఆఫ్కాఫ్ చైర్మన్ యాటగిరి రాం ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జబీవుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు జయసుబ్బారెడ్డి, బొమ్మిశెట్టి చంద్ర, అధికార ప్రతినిధులు మన్సూర్ అక్బర్, లోమడ మురళి, మీడియా కో ఆర్డినేటర్ జనార్దన్, టి ఎన్ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుమలేష్, కార్యాలయ కార్యదర్శి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174